RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

CITIZEN TIMES TELUGU DAILY



VOLUME: 17 | ISSUE: 278 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 05-5-2026 | Pages: 8 | Rs: 2/-

సంపుటి : 17 | సంచిక : 278 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 05-5-2026 | పేజీలు : 8 | రూ: 2/-

## దక్షిణ కోస్తా రైల్వే జోన్‌తో ఉత్తరాంధ్ర పారిశ్రామిక వృద్ధి

విశాఖ రైల్వే జోన్‌పై కేంద్రం గెజిట్..

ఏపీ ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందన్న సీఎం చంద్రబాబు

విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌పై గెజిట్ విడుదల

ప్రధాని మోదీ, రైల్వే మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ముఖ్యమంత్రి

2026 జూన్ 1 నుంచి అధికారికంగా జోన్ కార్యకలాపాలు ప్రారంభం

ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇది దోహదపడుతుందని ఆశాభావం




**అమరావతి, సిటిజన్ టైమ్స్**

విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ రైల్వేశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం హర్షణీయమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. "ఏపీ ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది. 2026 జూన్ 1వ తరువాయి 2లో..

## డేటా సెంటర్లను మేమే నడిపిస్తాం

ఏపీని గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని మంత్రి లోకేష్

శ్రీసిటీలో క్యారియర్ సంస్థ చిల్లర్ తయారీ ప్లాంట్‌కు బుధవారం శంకుస్థాపన

డేటా సెంటర్లకు ఆతిథ్యం ఇవ్వడమే కాక, వాటిని నడిపించే శక్తిగా ఏపీ మారుతుందని స్పష్టం

గూగుల్, రిలయన్స్ వంటి సంస్థల భారీ పెట్టుబడులతో ఏపీ దూసుకెళ్తోందని వెల్లడి

దిగుమతులు తగ్గించి, ఎగుమతులు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న లోకేష్



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

నెక్స్ట్ జనరేషన్ మాన్యుఫ్యాక్చరింగ్, డిజిటల్ మౌలిక సదుపాయాలకు ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. కేవలం డేటా సెంటర్లకు ఆతిథ్యం ఇవ్వడమే కాకుండా, వాటిని నడిపించే కీలక భాగాల తయారీ కేంద్రంగా ఏపీని మార్చడమే తమ లక్ష్యమని ఆయన మంగళవారం స్పష్టం చేశారు. ఇందులో భాగంగా శ్రీసిటీలో క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్న చిల్లర్ తరువాయి 2లో..

## ఎన్నికల్లో అనూహ్య విజయం..

### గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరిన విజయ్..!



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

విజయ్ టీవీకే పార్టీ తమిళనాడులో అనూహ్య విజయం సాధించినప్పటికీ.. ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 118 సీట్లను దక్కించుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఏర్పాటుపై చర్చించడానికి విజయ్ గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. రెండు వారాల్లో మెజారిటీ నిరూపించుకుంటామని గవర్నర్‌కు రాసిన లేఖలో తరువాయి 2లో..

## నేను రాజీనామా చేయను

### మమతా బెనర్జీ




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

పశ్చిమ బెంగాల్‌లో తాము భాజపాతో పోరాడలేదని.. ఆ పార్టీ కోసం పనిచేసిన ఎన్నికల సంఘంతో పోరాడామని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. తన జీవితంలో ఇలాంటి ఎన్నికలను ఎప్పుడూ చూడలేదన్నారు. తాను సీఎం పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజాతీర్పు వల్ల కాదని.. కుట్ర కారణంగానే తాము ఓడిపోయామన్నారు. ఫలితాల అనంతరం.. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్ తదితర నేతలు తనకు ఫోన్ చేసి సంఘీభావం తెలిపారన్నారు. ఇకపై 'ఇండియా' కూటమి బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. "ఈ ఎన్నికల్లో ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ.. ఈవీఎంలను తారుమారు చేస్తూ.. సీఈసీ ఓ విలన్‌గా మారారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత కూడా ఈవీఎంలలో 80-90 శాతం ఛార్జ్ ఉంటుందా? అదెలా సాధ్యం? ఎన్నికలకు రెండు రోజుల ముందు.. మా పార్టీ శ్రేణులను అరెస్టు చేయడం మొదలుపెట్టారు. అన్నిచోట్లా సోదాలు తరువాయి 2లో..

## హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తత..

### 6 ఇరాన్ పడవలను ధ్వంసం చేసిన అమెరికా

హర్మూజ్ జలసంధిని తెరిపించేందుకు అమెరికా 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'

అమెరికా నౌకలపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు

తమ పడవలు ధ్వంసమవలేదని ప్రకటించిన ఇరాన్

15,000 మంది సైనికులతో భారీ ఆపరేషన్ చేపట్టిన అమెరికా



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

హర్మూజ్ జలసంధిలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఇరాన్‌కు చెందిన ఆరు చిన్న పడవలను ధ్వంసం చేశామని, ఆ దేశం ప్రయోగించిన క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్లను అడ్డగించామని అమెరికా సైన్యం సోమవారం ప్రకటించింది. కీలకమైన ఈ జలమార్గం ద్వారా నౌకా రవాణాను పునరుద్ధరించేందుకు యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్' పేరుతో ఈ ఆపరేషన్‌ను ప్రారంభించారు. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్‌తో వివాదం మొదలైన తర్వాత ఇరాన్ ఈ జలమార్గాన్ని దిగ్బంధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమెరికా సెంట్రల్ కమాండ్ హెడ్, అడ్మిరల్ బ్రాడ్ కూపర్ మాట్లాడుతూ.. అమెరికా ఆపరేషన్‌ను ఇరానియన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ అడ్డుకోవాలని చూస్తోందన్నారు. "మేం రక్షణ కల్పిస్తున్న నౌకలపై ఐఆర్‌జీసీ తరువాయి 2లో..

## విశ్వవిద్యాలయాల్లో.. 1,500 పోస్టుల భర్తీ

### 15న నోటిఫికేషన్ ఇచ్చేందుకు ఉన్నత విద్యాశాఖ సన్నద్ధం




**అమరావతి, సిటిజన్ టైమ్స్**

విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక పోస్టుల నియామక ప్రకటన విడుదలకు ఉన్నత విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. జాబ్ కేలండర్‌లో ప్రకటించినట్లు ఈనెల 15న 1,500 పోస్టులకు ప్రకటన విడుదల కానుంది. విశ్వవిద్యాలయాలకు మంజూరు చేసిన పోస్టుల్లో బ్యాక్‌లాగ్‌లు మినహాయించి మిగతా వాటిల్లో 43% ఖాళీలు భర్తీ చేసేలా ప్రణాళిక రూపొందించారు. వీటికి రిజర్వేషన్ రోస్టర్‌ను ఖరారు చేసే ప్రక్రియను తరువాయి 2లో..




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**


పశ్చిమాసియా ఘర్షణల వేళ అమెరికాకు మరో ఎదురుదెబ్బ తగిలినట్లు కనిపిస్తోంది. ఆ దేశ మిలిటరీ విమానాలకు ఎగిరే గ్యాస్ స్టేషన్‌గా పనిచేసే బోయింగ్ ఖజ-135 స్ట్రాటోట్యాంకర్ ఖతార్ గగనతలంలో రాడార్‌తో సంబంధాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అల్ దఫ్రా ఎయిర్‌బేస్ నుంచి టేకాఫ్ అయిన ఈ ట్యాంకర్ పర్షియన్ గల్ఫ్ మీదుగా ప్రయాణిస్తున్నప్పుడు ఎమర్జెన్సీ సిగ్నల్ పంపినట్లు ఇరాన్ మీడియా సంస్థ పేర్కొంది. అత్యవసరంగా ల్యాండింగ్ చేయాల్సి వచ్చినప్పుడే అలాంటి కోడ్‌ను ప్రసారం చేస్తారని పేర్కొంది. పశ్చిమాసియా ఘర్షణల నేపథ్యంలో అక్కడ మోహరించిన విమానాలకు అవసరమైన ఇంధనాన్ని సరఫరా చేసేందుకు ఈ ట్యాంకర్‌ను అమెరికా సైన్యం ఉపయోగిస్తోంది. దీనివల్ల ఫైటర్ జెట్స్, బాంబర్లు, ఇతర సైనిక విమానాలు ఎక్కువ గంటలు ప్రయాణించేందుకు వీలు కలుగుతుంది. తాజాగా ఈ విమానం అత్యవసర ల్యాండింగ్‌కు యత్నిస్తోన్న సమయంలో కొద్దిసేపు గుండ్రంగా తిరిగినట్లు ఫ్లైట్‌రాడార్24 డేటాలో కనిపించింది. అయితే అది ఎందుకు అత్యవసరంగా ల్యాండ్ కావాల్సి వచ్చిందో మాత్రం తెలియరాలేదు. అలాగే ఇరాన్-అమెరికా ఉద్రికత్తలకు దీనికి ఏమైనా సంబంధం ఉందా..? అనేది కూడా స్పష్టత లేదు. తమ ప్రమేయంపై ఇరాన్ ఎలాంటి ప్రకటనా చేయలేదు. తరువాయి 2లో..

## బీజేపీ ఎన్నికల దొంగ.. రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు

బెంగాల్, అసోంలో బీజేపీ ఎన్నికలను దొంగిలించిందన్న రాహుల్

ఎన్నికల సంఘం సాయంతో ఫలితాలను తారుమారు చేసిందని ఆరోపణ

బెంగాల్‌లో 100 సీట్లు దొంగిలించారన్న మమత వాదనకు మద్దతు



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

భారతీయ జనతా పార్టీ (బీజేపీ)పై కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు తరువాయి 2లో..

## ఎడిటోరియల్

### ఉత్తరాంధ్ర వారసులు.. పొలిటికల్ అవకాశాలు.. !

రాజకీయాల్లో వారసత్వాలకు కొరత, కొదవలేదు. సీనియర్లు తమ కుటుంబాల నుంచి నాయకులను పరిచయం చేస్తున్నారు. యువ నేతలు కూడా దూకుడుగానే వ్యవహరిస్తున్నారు. టికెట్ వస్తుందా రాదా అనే విషయాన్ని పక్కన పెడితే యువ నేతలు ఉత్సాహంగానే రాజకీయాలు చేసేందుకు ముందుకు వస్తున్నారు .ఈ క్రమంలో రాయలసీమ నుంచి ఎక్కువ మంది యువ నేతలు కనిపిస్తుండగా.. అదే స్థాయిలో ఉత్తరాంధ్ర నుంచి కూడా యువ నేతలు రాజకీయ రంగ ప్రవేశం ఇప్పటికే చేశారు. మరి కొందరు రెడీగా కూడా ఉన్నారు. అయితే వీరిలో ఎంతమంది ప్రజలను ఒప్పించగలరు.. మెప్పించగలరు.. ఓటు బ్యాంకును సాధించగలరు.. అనే విషయాలు ఎటు తేలడం లేదు. గత ఎన్నికల్లోనే ఒకరిద్దరు సీనియర్ నాయకులు తమ వారసులను రంగంలోకి దింపాలని భావించారు. కానీ, పోటీ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అటు వైసిపి ఇటు టిడిపి కూడా వారసులకు టికెట్లు ఇవ్వలేదు. దీంతో వారసులు పక్కకు తప్పుకోవాల్సి వచ్చింది. అయితే ఇప్పుడు వచ్చే ఎన్నికల నాటికి మాత్రం ఖచ్చితంగా తమ వారసులను బరిలో నెలపాలని సీనియర్లు ఇప్పటినుంచే పట్టుబడుతున్నారు. తమ పిల్లలను నియోజకవర్గాల్లోకి దింపేశారు కూడా. ఇలాంటి వారిలో ఉమ్మడి విశాఖపట్నంలోని నర్సీపట్నం నియోజకవర్గం నుంచి చింతకాయల విజయ్ దూకుడుగా ఉన్నారు. ఈయన పార్టీలో సీనియర్ యువనేతగా పనిచేస్తున్నారు. గత ఎన్నికల సమయంలోనూ దీనికి ముందు కూడా ఆయన యాక్టివ్గా పార్టీ కార్యక్రమాల్లో పార్టిసిపేట్ చేశారు. వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా విజయ్ కు టికెట్ ఇవ్వాల్సిందేనని ఆయన తండ్రి, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పట్టుబడుతున్నారు. పైగా లోకేష్ టీం లో ఉన్నారన్న చర్చ కూడా వినిపిస్తోంది. దీంతో ఖచ్చితంగా విజయ్‌కు టికెట్ లభించటం ఖాయమని అంటున్నారు. ఇక స్థానికంగా ఉన్న రాజకీయాలను గమనిస్తే చింతకాయల విజయ్ కు యువత ఫాలోయింగ్ ఎక్కువగానే ఉంది. ప్రజల్లోనూ అయ్యన్నపాత్రుడుకు ఉన్న సానుభూతి.. వారికి ఉన్న రాజకీయ వర్గం విజయ్‌కు అనుకూలంగానే మారే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో ఆయన విజయం సాధించడం ఖాయమని చెబుతున్నారు. ఇక ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని ఆముదాల వలస నియోజకవర్గం నుంచి ఈ దఫా తమ్మినేని చిరంజీవి కచ్చితంగా పోటీ చేస్తారని ఆయన తండ్రి అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఘంటాపదంగా చెబుతున్నారు. వాస్తవానికి గత ఎన్నికల్లోనే చిరంజీవి నాగ్‌కు టిక్కెట్టు ఇవ్వాలని సీతారాం పట్టుబట్టారు. కానీ.. అనూహ్యంగా రాజకీయ పరిణామాలు మారిపోవడంతో జగన్ ఈ విషయాన్ని పక్కనపెట్టి సీతారామ్‌కే టికెట్ కేటాయించారు. కానీ ఇప్పుడు ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నందున వచ్చే ఎన్నికల్లో చిరంజీవి నాగ్ కు టికెట్ ఇవ్వాల్సిందేనని సీతారాం తేల్చేశారు. దీనిపై వైసీపీ అధినేత జగన్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోయినప్పటికీ టికెట్ ఖాయమనే చర్చ నడుస్తోంది. ఇక చిరంజీవి రాజకీయాలను చూసుకుంటే గత రెండు ఎన్నికల్లో కూడా తండ్రి తరఫున ఆయన ప్రచారం చేశారు. యువతను ఆకట్టుకునే లాగా వ్యవహరించారు. ముఖ్యంగా ఐటి రంగంలో అనుభవం ఉన్న చిరంజీవి సోషల్ మీడియా వేదికగా ప్రచారాన్ని ముమ్మరం చేయడం విశేషం. తరచుగా సోషల్ మీడియాలో ఆయన అనేక పోస్టులు పెడుతూ ఉంటారు. యూట్యూబ్ లో చానల్స్ కూడా నడుపుతారు. దీంతో ఆయనకు మంచి ఫాలోయింగ్ ఉందని చెబుతారు. ఇది వచ్చే ఎన్నికల్లో చిరంజీవికి కలిసివచ్చే అంశం అని అంటున్నారు. ఇక ఉత్తరాంధ్రకు చెందిన మరో యువ నాయకుడు కిడారి శ్రావణ్ కుమార్ 2014లో వైసిపి తరఫున అరకు నుంచి పోటీ చేసిన కిడారి సర్వేశ్వరరావు తర్వాత కాలంలో టిడిపిలోకి వచ్చారు. ఆయనకు మంత్రి పదవి దక్కుతుందని కూడా చర్చ నడిచింది. ఇంతలోనే మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో సర్వేశ్వరరావు మృతి చెందారు. అనంతరం ఆయన వారసుడిగా కిడారి శ్రావణ్ టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ క్రమంలోనే చంద్రబాబు ఆయనకు మంత్రి పదవి కూడా ఇచ్చారు. నిజానికి అప్పటికి అటు అసెంబ్లీకి కానీ ఇటు శాసన మండలికి కానీ శ్రావణ్ కుమార్ ప్రాతినిధ్యం వహించడం లేదు. అయినప్పటికీ ఆరు మాసాల పాటు ఆయన మంత్రిగా పనిచేశారు. తర్వాత 2019 ఎన్నికల్లో అదే అరకు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయనకు టిడిపి టికెట్ ఇచ్చింది. కానీ వైసీపీ హవాతో పాటు జగన్ పాదయాత్ర కారణంగా శ్రావణ్ కుమార్ పరాజయం పాలయ్యారు. ఓ రకంగా చెప్పాలంటే ఆయనకు డిపాజిట్ దక్కలేదని కూడా ప్రచారంలో ఉంది. గత ఎన్నికల విషయానికి వచ్చేసరికి అసలు పార్టీ టికెట్ కూడా ఇవ్వలేదు. అంతర్గతంగా చేయించిన సర్వేలు పార్టీ సీనియర్ నాయకులు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకున్న చంద్రబాబు గత ఎన్నికల్లో ఈ టికెట్ను మిత్రపక్షమైన బిజెపికి కేటాయించారు. ఇక వచ్చే ఎన్నికల నాటికైనా కిడారి శ్రావణ్‌కు టికెట్ దక్కుతుందా లేదా అనేది చూడాలి. ప్రస్తుతం అయితే ఆయన తన ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే సమయంలో యువతను ఆకర్షించే దిశగా కూడా ప్రయత్నిస్తున్నారు. కానీ, వచ్చే ఎన్నికల నాటికి టికెట్ విషయంలో పార్టీ నుంచి ఇంకా ఎటువంటి హామీ లభించలేదు. ఆయన చేసే పనితీరు, పార్టీలో వ్యవహరించే విధానాలు, పార్టీని ముందుకు తీసుకెళ్లే విషయంలో ఎలా వ్యవహరిస్తారు అనే అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే టికెట్ పై క్లారిటీ వచ్చే అవకాశం ఉందని స్థానిక టిడిపి నేతలు చెబుతున్నారు. సో ఇలా కొంతమంది యువ నాయకులు ఉత్తరాంధ్ర నుంచి రాజకీయాల్లోకి వచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మరి ఏ మేరకు సక్సెస్ అవుతారు అనేది చూడాలి.

## డేటా సెంటర్లను మేమే నడిపిస్తాం

తయారీ యూనిట్‌కు బుధవారం శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. “డేటా సెంటర్లకు కేవలం ఆతిథ్యం ఇవ్వడంతోనే ఏపీ సరిపెట్టుకోదు. వాటిని నడిపించే ఇంజిన్‌గా మారాలని మేము నిశ్చయించుకున్నాం. శ్రీసిటీలో క్యారియర్ ప్లాంట్ ఏర్పాటు మా ప్రయాణంలో ఒక చారిత్రాత్మక ఘట్టం” అని లోకేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీసిటీ వంటి ప్రపంచ స్థాయి పారిశ్రామిక ప్రాంతాలు, బలమైన విధానాల మద్దతుతో ఈ లక్ష్యాన్ని సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే డేటా సెంటర్ల ఏర్పాటులో దేశంలోనే కీలక గమ్యస్థానంగా ఎదుగుతోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇటీవల విశాఖపట్నంలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ ఏఐ డేటా సెంటర్ హబ్‌కు శంకుస్థాపన జరిగింది. దీనికి తోడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి రూ.1.6 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. మొత్తంగా సుమారు రూ.6 లక్షల కోట్ల పెట్టుబడుల పైప్‌లైన్‌తో రాష్ట్రం ముందుకు సాగుతోంది. డేటా సెంటర్ల మౌలిక సదుపాయాల నుంచి వాటికి అవసరమైన కూలింగ్ సిస్టమ్స్, పవర్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్, ఎలక్ట్రానిక్స్ వంటి భాగాల తయారీ వరకు పూర్తిస్థాయి వ్యవస్థను రాష్ట్రంలో నిర్మించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. తద్వారా దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, ఎగుమతులను ప్రోత్సహించడంతో పాటు, డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తయారీలో భారతదేశాన్ని ప్రపంచ లీడర్‌గా నిలబెట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వ్యూహంలో భాగంగా ఇప్పటికే శ్రీసిటీ ఏసీ, కూలింగ్ తయారీ రంగంలో రూ.12,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది.

## హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తత..

క్షిపణులు, డ్రోన్లు, చిన్న పడవలతో దాడులు చేసింది. వాటన్నింటినీ మేం విజయవంతంగా తిప్పికొట్టాం” అని ఆయన వివరించారు. ఈ ఆపరేషన్‌లో 15,000 మంది అమెరికా సైనికులు, నేవీ డిస్ట్రాయర్లు, 100కి పైగా యుద్ధ విమానాలు, జలాంతర్గత ఆస్తులు పాలుపంచుకుంటున్నాయని కూపర్ తెలిపారు. అమెరికా సైనిక ఆస్తులకు దూరంగా ఉండాలని ఇరాన్ బలగాలకు ఆయన గట్టిగా సూచించారు. అమెరికా అపాచీ, సీహాక్ హెలికాప్టర్లు ఇరాన్ ఫాస్ట్ బోట్లను ముంచివేసినట్లు పేర్కొన్నారు. అయితే, తమ పడవలు ఏవీ ధ్వంసం కాలేదని ఇరాన్ ప్రభుత్వ మీడియా ఖండించింది. గత కొన్ని గంటలుగా ఒక్క వాణిజ్య నౌక కూడా జలసంధిని దాటలేదని, అమెరికా వాదనలు అవాస్తవమని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ తెలిపింది. ఇదిలా ఉండగా, జలసంధిలో ఓ దక్షిణ కొరియా నౌకపై పేలుడు సంభవించింది. ఇరాన్ బెదిరింపులు ఉన్నప్పటికీ, జలసంధి గుండా ప్రయాణించాలని తాము డజన్ల కొద్దీ నౌకలను, షిప్పింగ్ కంపెనీలను ప్రోత్సహిస్తున్నామని కూపర్ చెప్పారు. ఇరాన్ దిగ్బంధనం కారణంగా గల్ఫ్‌లో సుమారు 800కు పైగా వాణిజ్య నౌకలు చిక్కుకుపోయాయి.

## విశ్వవిద్యాలయాల్లో.. 1,500 పోస్టుల భర్తీ

విశ్వవిద్యాలయాలు చేపట్టాయి. వర్సిటీల్లో 3,220 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 2017–18లో తెదేపా ప్రభుత్వం 1,109 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. దీనికి సంబంధించిన కేసు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది. దీనివల్ల ఆ 1,109 పోస్టులను పక్కన పెట్టి... మొదటి విడతగా 1,500 భర్తీ చేయనున్నారు. అన్ని విశ్వవిద్యాలయాల్లో కలిపి బ్యాక్‌లాగ్ పోస్టులు 279 ఉన్నాయి. వీటితో కలిపి ప్రకటన విడుదల చేయనున్నారు. అత్యధికంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బ్యాక్‌లాగ్ పోస్టులు సహా 246 ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఆ తర్వాత రాజీవ్ గాంధీ విజ్ఞాన విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ)లో 207 పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉంది. శ్రీవేంకటేశ్వరలో 125, ఆర్జీయూకేటీ 104, శ్రీకృష్ణదేవరాయలో 103 పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టారు. ఆంధ్రకేసరి వర్సిటీలో 13, ద్రవిడలో 18, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 32 పోస్టులు భర్తీ చేసే అవకాశం ఉంది. బ్యాక్‌లాగ్ పోస్టులు ఆర్జీయూకేటీలో అత్యధికంగా 103.. యోగివేమనలో 43 ఉన్నాయి. అత్యల్పంగా ఆచార్య నాగార్జునలో ఒకటి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌లో 4, ద్రవిడలో 5 పోస్టులు ఉన్నాయి.- పోస్టుల సర్దుబాటు ముగిసింది. రిజర్వేషన్ రోస్టర్ పూర్తి చేశాక తుది జాబితా తయారవుతుంది. చాలా విశ్వవిద్యాలయాల్లో కొన్ని విభాగాల్లో విద్యార్థుల ప్రవేశాలు లేవు. అక్కడ పని చేస్తున్న వారూ లేరు. ఇలాంటి పోస్టుల భర్తీని వాయిదా వేశారు.

## ఫోక్సో యాక్ట్ - 2012 ఏమి చెబుతుంది..?




భారతదేశంలో పిల్లలను లైంగిక నేరాల నుంచి రక్షించేందుకు రూపొందించిన కీలక చట్టం (ఫోక్సో యాక్ట్). 2012 మేలో పార్లమెంట్ ఆమోదించిన ఈ చట్టానికి జూన్ 19న రాష్ట్రపతి సమ్మతి లభించగా, జూన్ 20న గెజిట్‌లో నోటిఫై చేశారు. నవంబర్ 14, 2012 నుంచి అమలులోకి వచ్చిన ఈ చట్టాన్ని 2019లో సవరిస్తూ శిక్షలను మరింత కఠినతరం చేశారు. ఈ చట్టం ప్రకారం 18 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి వ్యక్తిని “పిల్ల”గా నిర్వచిస్తూ, బాలురు, బాలికలు అనే తేడా లేకుండా సమాన రక్షణ కల్పిస్తుంది. నేరస్థుడు పురుషుడు, మహిళ లేదా థర్డ్ జెండర్ అయినా చట్టం వర్తిస్తుంది. ముఖ్యంగా, పిల్లల విషయంలో “ఆమోదం” (కాన్సెంట్) అనే అంశాన్ని చట్టం పరిగణించదు. 18 సంవత్సరాల లోపు వారిపై ఏ లైంగిక చర్య జరిగినా అది నేరంగానే పరిగణించబడుతుంది. ఫోక్సో చట్టం కింద ప్రవేశించే లైంగిక దాడి, లైంగిక దాడి (స్పర్శ), లైంగిక వేధింపులు, అసభ్య ప్రవర్తన, పిల్లలను అశ్లీల ప్రయోజనాలకు వినియోగించడం వంటి నేరాలు చేర్చబడ్డాయి. ఈ కేసుల్లో సాధారణంగా కనీసం 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానా విధించబడుతుంది. తీవ్రమైన కేసుల్లో 20 సంవత్సరాల జైలు శిక్ష, జీవిత ఖైదు లేదా 16 సంవత్సరాల లోపు పిల్లలపై దారుణ అత్యాచారం జరిగితే మరణశిక్ష కూడా విధించే అవకాశం 2019 సవరణతో అమల్లోకి వచ్చింది. ఇటీవల అమలులోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత (బి. ఎన్. ఎస్) ప్రకారం, ఫోక్సో కేసులకు అనుసంధానంగా కొన్ని సెక్షన్లు వర్తిస్తాయి. బి.ఎన్.ఎస్ సెక్షన్ 63 (అత్యాచారం), సెక్షన్ 64/65 (తీవ్రమైన అత్యాచారం), సెక్షన్ 74 (స్త్రీ అణకువకు భంగం), సెక్షన్ 75 (లైంగిక వేధింపులు), సెక్షన్ 77 (అశ్లీల చర్యలు) వంటి నిబంధనలు కేసు స్వభావాన్ని బట్టి అదనంగా చేర్చబడతాయి. అయితే పిల్లలపై నేరాల విషయంలో ఫోక్సో చట్టానికే ప్రాధాన్యం ఉంటుంది. కేసుల విచారణ ప్రస్తుతం భారతీయ నాగరిక సురక్ష సంహిత (బి.ఎన్. ఎస్. ఎస్ ) ప్రకారం కొనసాగుతోంది. బి.ఎన్.ఎస్.ఎస్ సెక్షన్ 173 ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు తప్పనిసరి కాగా, సెక్షన్ 180/183 కింద పిల్లల స్టేట్‌మెంట్‌ను సురక్షిత వాతావరణంలో రికార్డ్ చేయాలి. సెక్షన్ 184 ప్రకారం వైద్య పరీక్ష నిర్వహించాలి. సెక్షన్ 193 ప్రకారం చార్జ్‌షీట్ త్వరితగతిన దాఖలు చేయాలి. తదనంతరం వేగవంతమైన విచారణకు ప్రత్యేక న్యాయస్థానాలు చర్యలు తీసుకుంటాయి. గతంలో పిల్లలపై లైంగిక నేరాలు ప్రధానంగా ఇండియన్ పెనల్ కోడ్ కింద విచారణకు వచ్చినప్పటికీ, సమగ్ర రక్షణ లేకపోవడంతో ప్రత్యేకంగా ఫోక్సో చట్టం రూపొందించబడింది. ప్రస్తుతం ఫోక్సో,బిఎన్ఎస్,బిఎన్ఎస్ఎస్ మూడు చట్టాలు కలిపి పిల్లలపై జరుగుతున్న దారుణాలను అరికట్టేందుకు బలమైన చట్ట పరిరక్షణను అందిస్తున్నాయి.

కేసులో ఉదాహరణ:-

ఇటీవల విజయనగరం జిల్లాలో జరిగిన ఒక కేసులో, మైనర్ బాలికపై నేరానికి పాల్పడిన నిందితుడికి పోక్సో ప్రత్యేక కోర్టు 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానా విధించడం చట్టం కఠినతకు నిదర్శనంగా నిలిచింది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ చట్టాల సమర్థవంతమైన అమలు ద్వారా పిల్లల భద్రత మరింత బలోపేతం అవుతుందని చెబుతున్నారు.

**జె. కనక దుర్గ లక్ష్మీ**
**ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ (IHR)**
**ఉత్తరాంధ్ర ఇంచార్జి.**

## మొదటి పేజీ తరువాయి

### దక్షిణ కోస్తా రైల్వే జోన్‌తో ఉత్తరాంధ్ర పారిశ్రామిక వృద్ధి

తేదీ నుంచి విశాఖ కేంద్రంగా జోన్ అధికారిక కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. వాల్తేరు డివిజన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలాస–ఇచ్ఛాపురం వంటి కీలక సెక్షన్లను విశాఖ డివిజన్‌లో విలీనం చేయడం ఉత్తరాంధ్ర రవాణా రంగ ముఖచిత్రాన్ని మారుస్తుంది. నూతనంగా ఏర్పాటైన విశాఖ డివిజన్, రాయగడ డివిజన్ల మధ్య సమన్వయంతో రైల్వే వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది. రాష్ట్ర అభివృద్ధికి, ప్రత్యేకించి ఉత్తరాంధ్ర పారిశ్రామిక వృద్ధికి దోహద పడుతుంది. ఏపీ విజ్ఞప్తిని మన్నించి చరిత్రాత్మక గెజిట్ విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కి ధన్యవాదాలు తెలియజేస్తున్నా” అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజల చిరకాల స్వప్నమైన విశాఖపట్నం రైల్వే జోన్‌పై కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ రైల్వే శాఖ అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నిర్ణయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిన చారిత్రాత్మక క్షణమని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. రాష్ట్ర విజ్ఞప్తిని మన్నించి చారిత్రాత్మక గెజిట్ విడుదల చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. 2026 జూన్ 1వ తేదీ నుంచి విశాఖ కేంద్రంగా జోన్ కార్యకలాపాలు అధికారికంగా ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. వాల్తేరు డివిజన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలాస-ఇచ్ఛాపురం వంటి కీలక సెక్షన్లను విశాఖ డివిజన్‌లో విలీనం చేయడం శుభపరిణామమని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ మార్పులతో ఉత్తరాంధ్ర రవాణా రంగ ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడిన విశాఖ, రాయగడ డివిజన్ల మధ్య సమన్వయంతో రైల్వే వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, రాష్ట్ర అభివృద్ధికి, ముఖ్యంగా ఉత్తరాంధ్ర పారిశ్రామిక ప్రగతికి ఈ జోన్ ఏర్పాటు ఎంతగానో దోహదపడుతుందని ముఖ్యమంత్రి వివరించారు.

### ఎన్నికల్లో అనూహ్య విజయం.. గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరిన విజయ్..!

పేర్కొన్నట్లు తెలుస్తోంది. టీవీకే 108 స్థానాల్లో విజయం సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ ప్రభుత్వం ఏర్పాటుచేయాలంటే.. ఆ పార్టీకి మరో 10 మంది ఎమ్మెల్యేల మద్దతు కావాల్సిఉంది. దీంతో ఏ కూటమి నుంచి మద్దతు కూడగట్టాలనే విషయంపై పార్టీ నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. టీవీకే నేతృత్వంలోని ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడానికి కాంగ్రెస్, పీఎంకే సుముఖంగా ఉన్నాయని.. ఇందుకోసం ఇరు పార్టీలు చెరో రెండు మంత్రి పదవులను కోరుతున్నాయని సమాచారం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విజయ్‌తో సోమవారం ఫోన్‌లో మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు వామపక్ష పార్టీలు సైతం టీవీకే నేతలతో అంతర్గత సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అయితే టీవీకే ఎవరి సాయం తీసుకుంటుందనే విషయంపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశముంది. కాగా.. ఎన్నికల్లో విజయం సాధించిన పార్టీ అభ్యర్థులను కలవడానికి విజయ్ ఉదయం 10గంటలకు టీవీకే కార్యాలయానికి బయలుదేరనున్నారని టీవీకే వర్గాలు తెలిపాయి.

### నేను రాజీనామా చేయను

నిర్వహించారు. ఐపీఎస్, ఐఏఎస్ అధికారులందరినీ మార్చేశారు. ఎన్నికల సంఘంతో కలిసి భాజపా గేమ్ ఆడింది. మేం అన్ని యంత్రాంగాలకు వ్యతిరేకంగా పోరాడాం. ఎస్ఐఆర్ పేరిట 90 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారు. మేం కోర్టుకు వెళ్తే.. 32 లక్షల పేర్లను చేర్చారు.

**మే 9న బెంగాల్‌లో కొత్త ప్రభుత్వం**

ఓట్ల లెక్కింపులో భారీ అవకతవకలు చోటుచేసుకున్నాయి. దాదాపు 100 స్థానాల్లో మా గెలుపును కాజేశారు. టీఎంసీ మనోధైర్యాన్ని దెబ్బతీయడానికి లెక్కింపు ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా నెమ్మదిగా చేపట్టారు. చరిత్రలో ఇదొక చీకటి అధ్యాయం. ఎన్నికల అనంతర హింసతో ప్రభావితమైన ప్రాంతాలను సందర్శించి.. క్షేత్రస్థాయి పరిస్థితిని అంచనా వేసేందుకు 10 మంది సభ్యులతో కూడిన నిజనిర్ధరణ కమిటీని ఏర్పాటు చేస్తున్నాం” అని మీడియా సమావేశంలో మమతా బెనర్జీ తెలిపారు. 2021లో ఎన్నికల అనంతరం హింస జరిగిందన్న ఆరోపణలను ఆమె నిరాధారమైనవిగా కొట్టిపారేశారు.

### బీజేపీ ఎన్నికల దొంగ.. రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు

చేశారు. పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాల్లో బీజేపీ ఎన్నికల్లో గెలవలేదని, ఎన్నికల సంఘం (ఈసీ) సహకారంతో ఫలితాలను దొంగిలించిందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఈ మేరకు సోమవారం తన అధికారిక ‘ఎక్స్’ ఖాతాలో పోస్ట్ చేశారు. పశ్చిమ బెంగాల్‌లో 100కు పైగా సీట్లను బీజేపీ తారుమారు చేసిందంటూ తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ చేసిన ఆరోపణలతో తాము ఏకీభవిస్తున్నామని రాహుల్ స్పష్టం చేశారు. బెంగాల్, అసోంలలో ఎన్నికల ఫలితాలను స్పష్టంగా తారుమారు చేశారని ఆయన పేర్కొన్నారు. ఇది బీజేపీకి తెలిసిన పాత వ్యూహమేనని, గతంలో మధ్యప్రదేశ్, హర్యానా, మహారాష్ట్ర రాష్ట్రాలతో పాటు 2024 లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఇదే తరహా పద్ధతిని చూశామని అన్నారు. “ఎన్నికలను దొంగిలించడం, ప్రజాస్వామ్య సంస్థలను నిర్వీర్యం చేయడం.. ఇక వాళ్లకు మిగిలిన దారి ఏముంది!” అని రాహుల్ తన పోస్టులో ప్రశ్నించారు. బీజేపీ కేవలం ఎన్నికలనే కాకుండా, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే వ్యవస్థల విశ్వసనీయతను కూడా దెబ్బతీస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# జీవీఎంసీలో 24/7 తాగునీటి హెల్ప్‌లైన్ ప్రారంభం

## కమిషనర్ కేతన్ గార్గ్



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే:5**

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలో తాగునీటి సరఫరా సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు 24/7 హెల్ప్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రజలు నీటి సరఫరాకు సంబంధించిన ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా టోల్‌ఫ్రీ నెంబర్ 1800 4250 0009కు కాల్ చేసి పరిష్కారం పొందవచ్చని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. నగర ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించేందుకు జీవీఎంసీ ఇప్పటికే భారీగా నిధులు ఖర్చు చేస్తోందని, అదనంగా వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రూ.8.90 కోట్లతో 91 పనులు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఈ చర్యల ద్వారా నీటి సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసి, ఎలాంటి అంతరాయాలు లేకుండా ప్రజలకు సేవలు అందించడమే లక్ష్యమన్నారు. హెల్ప్‌లైన్ ద్వారా నీటి సరఫరా ఆలస్యం, పైపులైన్ల లీకేజీలు, నీటి కలుషితం, సరఫరాలో అంతరాయాలు వంటి సమస్యలను వెంటనే సంబంధిత అధికారులకు చేరవేసి పరిష్కరించేలా ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. జివిఎంసీ సిటీ ఆపరేషన్ సెంటర్ ద్వారా ఫిర్యాదులను స్వీకరించి, ఆయా జోన్లలోని సహాయక ఇంజనీర్లకు వెంటనే సమాచారం అందిస్తారని చెప్పారు. జీవీఎంసీ పరిధిలోని 10 జోన్లలో అన్ని వార్డుల ప్రజలకు ఈ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే, ప్రతి వార్డులోని నీటి సరఫరా విభాగం సహాయక ఇంజనీర్ల పేర్లు, ఫోన్ నంబర్ల వివరాలను కూడా ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ వేసవిలో నగరంలోని ఏ ఒక్కరూ తాగునీటి కొరతకు గురికాకుండా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని కమిషనర్ కేతన్ గార్గ్ విజ్ఞప్తి చేశారు.

# హెల్మెట్ ప్రాణరక్షణ కవచం

## బైక్ ర్యాలీలో మంత్రి అనిత పిలుపు





**నక్కపల్లి, సిటిజన్ టైమ్స్, మే :5**

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మంగళవారం పాయకరావుపేట నియోజకవర్గంలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఎస్.రాయవరం మండలం తిమ్మాపురం ఫ్లైఓవర్ (అడ్డురోడ్డు) వద్ద ప్రారంభమైన ర్యాలీ నక్కపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు కొనసాగింది. "సురక్షిత రోడ్లు సురక్షిత జీవితం" నినాదంతో నిర్వహించిన ఈ ర్యాలీలో మంత్రి స్వయంగా హెల్మెట్ ధరించి బైక్ నడిపి సుమారు 500 మంది యువత, పోలీసు సిబ్బందిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ర్యాలీ అనంతరం జరిగిన సభలో మంత్రి అనిత మాట్లాడుతూ, ప్రాణం అమూల్యమని, బైక్‌పై ఖర్చు చేసే వారు హెల్మెట్ కొనడంలో నిర్లక్ష్యం చేయకూడదని పేర్కొన్నారు. కుటుంబ భద్రత కోసం హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఎవరైనా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజకీయ నాయకులు నిబంధనలు ఉల్లంఘిస్తే రెట్టింపు జరిమానా విధించాలని పోలీసులకు ఆదేశించినట్లు తెలిపారు. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా మాత్రమే ప్రమాదాలను తగ్గించగలమని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం పెరగడం ఆందోళనకరమని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్. మోహనరావు, పాయకరావుపేట ఇన్స్పెక్టర్ శంకర్రావు, నక్కపల్లి సీఐ రామకృష్ణ, ఇన్స్పెక్టర్ మురళి, ఎస్సైలు రమేష్, విజయ్ కుమార్, అలీ షరీఫ్, సన్నీ బాబు తదితరులు, ప్రజా ప్రతినిధులు, మహిళా సంరక్షణ సిబ్బంది, యువత పాల్గొన్నారు.

# పర్యావరణ హితంగా ప్రతి ఒక్కరూ జీవించాలి

- గాలి,నీరు, భూమి కాలుష్యం కాకుండా చూసుకోవాలి - సామాజిక వనాలు విస్తారంగా పెంచాలి

- ప్రతి ఒక్కరూ పది మొక్కలు నాటి పెంచాలి - బి వీరేంద్ర, అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్, ఎపి పిసిబి

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే 05:**

పర్యావరణ హితంగా ప్రతి ఒక్కరూ జీవించాలి అని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ బి వీరేంద్ర పిలుపునిచ్చారు. సబ్బవరం లో దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం లో ఎన్ సి సి 13వ బెటాలియన్ క్యాంపు లో లెఫ్ట్ నెంట్ కల్నల్ స్వర్ణిం ప్రభాత్ అధ్యక్షతన, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ నేతృత్వంలో 600 మంది విద్యార్థులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మనం పీల్చే గాలినీ, మనం త్రాగే నీటిని, మనం నివసించె భూమినీ కాలుష్యం కాకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పది మొక్కలు నాటి పెంచాలని కోరారు. సామాజిక వనాలు విస్తారంగా పెంచాల్సిన బాధ్యత మానవాళిదే అని వివరించారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం మాట్లాడుతూ సమస్త జీవరాశినీ కాపాడటమే మానవత్వం అన్నారు. దీని వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. మారిషస్ లో డోడో పక్షులు వేటాడి తినడం వల్ల డోడో పక్షి పుట్టుక ఆగి పోయింది అని వివరించారు. మనిషి జీవులు గూడు నేయలేదని, భూమి



మీద ఉన్న జీవుల గూడు లో మనిషి ఒక భాగం మాత్రమే అనె ముఖ్యాంశాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించి సమస్త జీవులు రక్షణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఎస్ వి గోవింద రావు, అసోసియేషన్ ఆఫ్ పీపుల్స్ పవర్ సంస్థ ప్రతినిధి



నిమ్మకాయల భాస్కర్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ ఇంటెర్న్ షిప్ విద్యార్థిని నందిని రోహిత్, ఎన్ ఎస్ ఐ ఆర్ టి విద్యార్థులు పాల్గొన్నారు. గోవర్ధన పురం గోశాల ప్రతినిధి దొడ్డ మహేష్ అందజేసిన పిచ్చుకల గూళ్ళు, మట్టి పాత్రలు విద్యార్థులకు పంపిణీ చేశారు.

# జూనియర్ ఎన్టీఆర్ ఎపిసోడ్ ముగిసినట్టే

**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్ డెస్క్ :**



తమిళనాడు ఎన్నికల ఫలితాలు వచ్చాయి. పివికె అధినేత విజయ్ అనూహ్య విజయం దక్కించుకున్నారు. ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కానున్నారు. పార్టీ ఏర్పాటు చేసిన రెండు సంవత్సరాల్లో అధికారంలోకి వచ్చి రికార్డ్ సృష్టించారు. ఇండియన్ సినిమా హిస్టరీలో నందమూరి తారక రామారావు తర్వాత అంతటి ఘనత సాధించారు. విజయ్ గెలుపుతో దేశంలో మిగతా సినీ నటులు రాజకీయ అరంగేట్రం చేసి.. రాజకీయ పార్టీలు ఏర్పాటు చేస్తారన్న టాక్ ప్రారంభం అయింది. ముఖ్యంగా జూనియర్ ఎన్టీఆర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. తరువాత ఛాన్స్ జూనియర్ ఎన్టీఆర్ అని సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. అయితే పొలిటికల్ ఎంట్రీ కి జూనియర్ ఎన్టీఆర్ సిద్ధంగా ఉన్నారా అంటే మాత్రం సమాధానం దొరకదు. మునుపటి పరిస్థితి కూడా తెలుగుదేశంలో లేదు. అంతా సాఫీగా జరిగిపోయింది అధికార మార్పిడి. ఇప్పుడు అసలు జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తావన పార్టీలో లేదు. అంతలా మారిపోయింది స్వరూపం.

**అప్పట్లో తారక్ ను తేవాలని డిమాండ్**

తెలుగుదేశం పార్టీలోకి జూనియర్ ఎన్టీఆర్ను తెచ్చి యాక్టివ్ చేయాలన్నది సీనియర్ల అభిప్రాయమే కాదు. మెజారిటీ పార్టీ శ్రేణులు కూడా దానినే కోరుకున్నాయి. అయితే అది ఇప్పుడు కాదు. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆ పార్టీలో జూనియర్ ఎన్టీఆర్ స్వరం వినిపించింది. అందుకు కారణం లోకేష్. ఆయన అప్పట్లో అంత పరిణితి చెందలేదు. అందుకే చంద్రబాబు తర్వాత జూనియర్ ఎన్టీఆర్ ఆప్షన్ గా ఉండేది పార్టీ శ్రేణులకు. 2019 ఎన్నికల్లో టిడిపి ఓడిపోయిన తరువాత జూనియర్ ఎన్టీఆర్ పేరు ప్రముఖంగా వినిపించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కూడా నేతలు ఒక పద్ధతి ప్రకారం జూనియర్ ఎన్టీఆర్ పేరు తెరపైకి తెచ్చి చంద్రబాబును ఇరకాటంలో పెట్టారు. ఈ విషయంలో మాత్రం చంద్రబాబు ఎంతో సంయమనంతో వ్యవహరించారు. చాలా సహనంతో కూడా గడిపారు.

**అప్పట్లో రాజకీయ ఆసక్తి..**

గతంలో జూనియర్ ఎన్టీఆర్ హవ భావం.. ఆయన నుంచి వచ్చే సంకేతాలు రాజకీయ ఆసక్తిని నింపేవి. రాజకీయాల పట్ల ఆయన ఆసక్తితో ఉన్నారనే బలమైన సంకేతం ప్రజలకు వచ్చింది. కానీ రాజకీయాల కంటే సినిమా ముద్దు అంటూ.. తనకంటూ ఒక స్టార్ ఇమేజ్ ఏర్పడిన తర్వాత చూసుకోవచ్చు అన్నట్టు వ్యవహరిస్తూ వచ్చారు జూనియర్ ఎన్టీఆర్. కానీ 2024 ఎన్నికల్లో టిడిపి కూటమి గెలుపుతో మొత్తం స్వరూపమే మారిపోయింది. లోకేష్ తనకంటూ ఒక ముద్ర చాటుకుంటున్నారు రాజకీయాలతో పాటు పాలనలో. జాతీయస్థాయిలో కూడా సరైన గుర్తింపు పొందారు. ఫుల్ మార్కు రాజకీయాలు కనిపిస్తున్నాయి లోకేష్లో. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కూడా అయిపోయారు. ఇక తెలుగుదేశం పార్టీలో ఆయనకు తిరుగులేదు. ఇప్పుడు జూనియర్ ఎన్టీఆర్ వస్తాం అన్న ఆహ్వానించే వారు లేరు అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. అంతలా పార్టీపై పట్టు సాధించారు లోకేష్. మంచి వాగ్ధాటితో పాటు చరిష్మ ఉన్న ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చి రాణించడం కూడా అంత సులువు అని చెప్పలేము. అలాగని సాధ్యం కాదు అని చెప్పలేం. కానీ ఆయనకు తెలుగుదేశం పార్టీలో మాత్రం మునుపటి పరిస్థితి లేదు.

# విశాఖపట్నం రైల్వే హబ్‌గా అభివృద్ధికి నాంది : సి.ఎం. రమేష్

**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, మే :5**

ఆంధ్రప్రదేశ్‌కు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం రాష్ట్ర అభివృద్ధి దిశలో కీలక మైలురాయిగా నిలిచింది. విశాఖపట్నం కేంద్రంగా ఈ కొత్త జోన్ పరిధిని అధికారికంగా ప్రకటించడంతో రాష్ట్రానికి స్వంత రైల్వే పరిపాలన వ్యవస్థ ఏర్పడింది. ఈ సందర్భంగా రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి ఎంపీ డాక్టర్ సి.ఎం. రమేష్ ఆనందం వ్యక్తం చేస్తూ, ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజల చిరకాల స్వప్నం సాకారమైందని పేర్కొన్నారు. దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దూరదృష్టి నాయకత్వం, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ చొరవతో ఈ నిర్ణయం సాధ్యమైందని తెలిపారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టుదలతో కేంద్రంతో సాగించిన చర్చల ఫలితంగా ఈ చారిత్రాత్మక అడుగు ముందుకుపడిందని స్పష్టం చేశారు. విశాఖపట్నం కేంద్రంగా జోన్ ఏర్పాటుతో రాష్ట్ర రవాణా రంగంలో కొత్త దశ ప్రారంభమవుతుందని, జూన్ 1 నుంచి అధికారిక కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. ఈ జోన్ ద్వారా రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగవంతమవడంతో పాటు కొత్త రైలు మార్గాలు, అదనపు రైళ్లు ప్రవేశపెట్టే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా యువతకు ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని తెలిపారు. అదనంగా, అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో స్టేషన్ల ఆధునీకరణ, కొత్త ప్రాజెక్టుల ఆమోదం, రైల్వే కనెక్టివిటీ మెరుగుదల వంటి అంశాలు వేగవంతం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖపట్నం దేశంలో ప్రముఖ రైల్వే హబ్‌గా ఎదగడానికి ఈ నిర్ణయం




దోహదపడుతుందని అన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం సాధనలో భాగస్వాములైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు మరియు దీని కోసం సంవత్సరాలుగా కృషి చేసిన ప్రతి ఒక్కరికీ డాక్టర్ సి.ఎం. రమేష్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# బాలికకు పోలీసుల భద్రత



**అల్లిపురం, సిటిజన్ టైమ్స్, మే :05**

కాకినాడకు చెందిన మరియ అనే బాలికను టూ టౌన్ పోలీసులు అప్రమత్తంగా స్పందించి రక్షణలోకి తీసుకున్నారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఒక బాలిక ఒంటరిగా తిరుగుతుందన్న సమాచారం అందుకున్న వెంటనే పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకుని, బాలికను సురక్షితంగా స్టేషన్‌కు తరలించారు. బాలిక వివరాలను సేకరించిన అనంతరం, ఆమె కాకినాడకు చెందినదని, తనకు ఒక తమ్ముడు కూడా ఉన్నాడని తెలిపింది. కుటుంబ సమస్యల కారణంగా తల్లిదండ్రులు గొడవపడుతూ తనను పట్టించుకోలేదని, దిక్కుతోచక రైలెక్కి విశాఖపట్నం చేరుకున్నట్లు బాలిక పోలీసులకు వివరించింది. ఈ నేపథ్యంలో బాలికకు తక్షణ రక్షణ కల్పించేందుకు పోలీసులు ఆమెను సమీపంలోని షెల్టర్ హోమ్‌లో చేర్పించారు. ప్రస్తుతం బాలిక సురక్షితంగా ఉందని, తల్లిదండ్రుల వివరాలు సేకరించి వారిని సంప్రదించే చర్యలు కొనసాగుతున్నాయని టూ టౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు తెలిపారు. అలాగే, బాలికకు సంబంధించిన వివరాలు తెలిసిన వారు లేదా కుటుంబ సభ్యులు వెంటనే 9440904716 నంబర్‌కు సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# 'జలధార జలహారతి'తో చెరువు పునరుద్ధరణ వేగం



**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, మే :5**

అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం జంగులూరు వెలంపాలెం గ్రామాల రైతాంగానికి దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడింది. చారిత్రాత్మకమైన వెంకమ్మ కృష్ణసాగరం చెరువు పునరుద్ధరణ పనులు వేగంగా కొనసాగుతుండటంతో ఆ ప్రాంత వ్యవసాయ రంగానికి కొత్త ఊపు దక్కనుంది. ఒకప్పుడు నీటితో కళకళలాడిన ఈ చెరువు కాలక్రమేణా పూడికతో నిండిపోయి తన సామర్థ్యాన్ని కోల్పోయింది. సుమారు 145 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు గర్భం పూర్తిగా మట్టితో నిండిపోవడంతో వర్షాలు కురిసినా నీటిని నిల్వ చేయలేకపోయింది. దీంతో ఆయకట్టు కింద ఉన్న పంటభూములకు సాగునీరు అందక, భూగర్భ జలాలు పడిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'జలధార - జలహారతి' కార్యక్రమం కింద ఈ చెరువుకు పునర్జన్మ లభిస్తోంది. చెరువులో పేరుకుపోయిన పూడికను తొలగించడంతో పాటు, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే చర్యలు చేపడుతున్నారు. చెరువు గట్లను బలపరచడం, ప్రధాన కాలువలను ఆధునీకరించడం ద్వారా చివరి ఎకరం వరకు సాగునీరు అందేలా ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే సుమారు 150 ఎకరాల పంటభూములకు సాగునీరు అందడమే కాకుండా, భూగర్భ జలమట్టం పెరిగి తాగునీటి సమస్య కూడా తగ్గే అవకాశం ఉంది. రెండు పంటలు పండించే పరిస్థితులు ఏర్పడడంతో రైతుల ఆదాయం పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమవుతుందని అధికారులు చెబుతున్నారు. అదనంగా, చెరువు నుంచి తీసిన పూడిక మట్టిని రైతులు తమ పొలాలకు వినియోగించుకోవడం ద్వారా భూమి సారవంతం అవుతోంది. వెంకమ్మ కృష్ణసాగరం చెరువు పునరుద్ధరణతో జంగులూరు, వెలంపాలెం గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాలకు కూడా ఇది ఆదర్శంగా నిలుస్తోంది. ఈ అభివృద్ధి పనులపై రైతులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, ఇది తమ జీవనోపాధికి కొత్త ఆశలను తీసుకువచ్చిందని పేర్కొంటున్నారు.

# ప్రజా సేవలో ముందంజలో సాలాపు వెంకట సూరి అప్పారావు





**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, మే :05**

అనకాపల్లి జిల్లా, అనకాపల్లి మండలం అక్కిరెడ్డిపాలెం పంచాయతీలో ప్రజా సేవకు ప్రతీకగా నిలుస్తున్న పేరు సాలాపు వెంకట సూరి అప్పారావు. మండే ఎండలను సైతం లెక్కచేయకుండా గ్రామ ప్రజలకు త్రాగునీటి సమస్యలు తీరేలా కృషి చేస్తూ ఆయన చూపుతున్న సేవా తపన అందరికీ ఆదర్శంగా మారింది. గ్రామంలో త్రాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న ప్రజల కష్టాలను గుర్తించిన సూరి అప్పారావు, “ప్రజల కోసం నేను సైతం” అన్న భావంతో ముందుకు వచ్చారు. పనిచేయకుండా ఉన్న త్రాగునీటి మోటార్లను మరమ్మతు చేయించి, ఓవర్ హెడ్ ట్యాంక్ ద్వారా కొళాయిల ద్వారా శుద్ధమైన త్రాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టారు. దీంతో గ్రామ ప్రజలకు పెద్ద ఉపశమనం లభించింది. ఈ రోజుల్లో పదవుల కోసం పరితపించే పరిస్థితుల్లో, ఎలాంటి అధికార పదవి లేకపోయినా “మానవసేవే మాధవసేవ” అనే నినాదంతో ప్రజల మధ్యే ఉండి సేవలు అందించడం ఆయన ప్రత్యేకత. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావిస్తూ, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ ఆయన నిజమైన నాయకత్వాన్ని చాటుతున్నారు. సాలాపు వెంకట సూరి అప్పారావు చేస్తున్న సేవా కార్యక్రమాలు గ్రామంలోనే కాకుండా పరిసర ప్రాంతాల్లో కూడా ప్రశంసలు అందుకుంటున్నాయి. ఆయన చూపిస్తున్న సేవా దృక్పథం యువతకు మార్గదర్శకంగా నిలుస్తూ, సమాజంలో మంచి మార్పుకు దోహదపడుతోంది.

## దక్షిణ కోస్తా రైల్వే జోన్ రాష్ట్ర అభివృద్ధికి కీలకం: పట్టాభిరామ్



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే :05**

కేంద్ర ప్రభుత్వం దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు సంబంధించి అధికారిక గెజిట్ విడుదల చేయడంతో జోన్ ఏర్పాటు ప్రక్రియ పూర్తయిందని, ఇది రాష్ట్ర మౌలిక వసతుల అభివృద్ధికి కీలక ముందడుగని విశాఖ పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభిరామ్ తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద టిడిపి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. బాణాసంచా పేల్చి, కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి హాజరైన పట్టాభిరామ్ మాట్లాడుతూ, రైల్వే జోన్ ఏర్పాటు ద్వారా రాష్ట్రానికి రైల్వే రంగంలో అభివృద్ధి వేగవంతమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ గణబాబు మాట్లాడుతూ, జోన్ ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధి స్పష్టమైందన్నారు. ఈ సాధనలో విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ చేసిన కృషిని అభినందించారు. నాయకులు మాట్లాడుతూ, 40 ఏళ్లుగా ఎదురుచూస్తున్న స్వప్నం నెరవేరిందని, దీనివల్ల ఉత్తరాంధ్ర ప్రాంతంలో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు యువతకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ల కృషిని కొనియాడారు. రైల్వే జోన్ సాధన సమితి కన్వీనర్ చలసాని గాంధీ మాట్లాడుతూ, సంవత్సరాల పోరాటానికి ఇది ఫలితమని, రాష్ట్ర విభజన హామీల్లో ముఖ్యమైన అంశం నెరవేరిందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, మహిళలు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

## విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ గెజిట్ జారీ




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే 05**

విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 2026 జూన్ 1 నుంచి విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తున్నట్లు అందులో పేర్కొంది. గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్లను విశాఖ జోన్ పరిధిలోకి తీసుకొచ్చింది. 2019 ఫిబ్రవరిలో కేంద్రం ఈ జోన్ ఏర్పాటుపై ప్రకటన చేసింది. తర్వాత అది ముందుకు సాగలేదు. చివరికి 2025 జనవరిలో డీపీఆర్కు ఆమోదం తెలిపి అదే నెలలో జోనల్ కార్యాలయం భవన నిర్మాణానికి ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. తాజాగా కీలకమైన గెజిట్ నోటిఫికేషన్ రావడంతో అధికారిక కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. ఈ జోన్ కార్యకలాపాలకు కీలక అధికారుల నియామకం ఇప్పటికే పూర్తయింది. ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్, ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్, ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్, ప్రిన్సిపల్ చీఫ్ ఫైనాన్షియల్ అధికారుల నియామకం పూర్తయింది. ఇతర డివిజన్ల నుంచి ఆప్షన్లు కోరగా 3వేల మంది విశాఖ జీఎం కార్యాలయం పరిధిలో పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. జీఎం కార్యాలయంలో 1200 మంది అవసరం, జోన్ అంతటా 17వేల మంది వరకు పనిచేస్తారు.

# ఉత్తరాంధ్ర ఆశయాలు పోరాటాలు-కలలకు న్యాయం...

### విశాఖ సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు గెజిట్ విడుదల

### – సీఎం చంద్రబాబు కృషితో రైల్వే జోన్ సాకారం

### – టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే 05**

ఉత్తరాంధ్ర ఆశయాలు, పోరాటాలు, కలలకు న్యాయం జరిగిందని, ఎన్నో సంవత్సరాలుగా అనేక మంది నాయకులు చేసిన పోరాట పటిమకు పట్టం కట్టినట్లుగా విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడం చారిత్రాత్మక ఘట్టమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ... ఉత్తరాంధ్ర వాసుల చిరకాల వాంఛ నెరవేరడం వెనుక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతర కృషి, దూరదృష్టి ప్రధాన కారణమని స్పష్టం చేశారు. విభజన చట్టంలో ఉన్న హామీని కార్యరూపం దాల్చించే దిశగా చంద్రబాబు నిరంతరం కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి, ఈ అంశాన్ని జాతీయ స్థాయిలో ప్రధాన అజెండాగా నిలిపారని తెలిపారు. 2014-19 కాలంలో టీడీపీ ఎంపీలు పార్లమెంటు లోపల, బయట “విశాఖ రైల్వే జోన్ ఆంధ్రుల హక్కు” అంటూ గళమెత్తిన పోరాట ఫలితమే ఈ రోజు కనిపిస్తున్నదని అన్నారు. 2019లో జోన్ ప్రకటించినప్పటికీ, తరువాతి కాలంలో పనులు మందగించడం, ముఖ్యంగా 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో ప్రాజెక్టు నిలిచిపోవడం బాధాకరమని విమర్శించారు. భూసేకరణ వంటి కీలక అంశాల్లో ఆలస్యం చేయడం వల్లే ప్రాజెక్టు ముందుకు సాగలేదని పేర్కొన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రధాని నరేంద్ర మోడీ, రైల్వే శాఖతో చర్చలు జరిపి ప్రక్రియను వేగవంతం చేశారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి, పరిపాలనాపరమైన అడ్డంకులను తొలగించి రైల్వే జోన్ ఏర్పాటుకు మార్గం సుగమం చేశారని చెప్పారు. చంద్రబాబు విజ్ఞప్తికి స్పందించిన కేంద్ర ప్రభుత్వం భారీ స్థాయిలో నిధులు కేటాయించి, పరిపాలన అనుమతులను వేగవంతం చేయడంతో 2026 మే 4న గెజిట్ విడుదల కావడం సాధ్యమైందని పల్లా పేర్కొన్నారు. జూన్ 1 నుంచి విశాఖ కేంద్రంగా దక్షిణ తీర రైల్వే జోన్ పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించబోతుందని తెలిపారు. గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్లు ఈ జోన్ పరిధిలోకి రావడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు స్వంత



రైల్వే జోన్ లభించిందని చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వాన్ని పల్లా ప్రశంసిస్తూ... ఉత్తరాంధ్ర అభివృద్ధిని సమగ్ర దిశలో ముందుకు తీసుకెళ్తూ, స్టీల్ ప్లాంట్ పునరుజ్జీవనం నుంచి గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి గ్లోబల్ పెట్టుబడుల వరకు తీసుకువచ్చి విశాఖను ప్రపంచ పటంలో నిలిపిన నాయకుడు చంద్రబాబునని కొనియాడారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం సాధ్యంకావడంలో ప్రధాని నరేంద్ర మోడీ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ సహకారంతో పాటు విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, కేంద్ర మంత్రి కింజరాపు రామ్ మోహన్ నాయుడు, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సిఎం రమేష్ తదితరుల సమిష్టి కృషి కూడా ఎంతో కీలకమైందని పల్లా ప్రత్యేకంగా ప్రస్తావించారు. అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రైల్వే జోన్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రాంతంలో వేలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని, కొత్త రైలు మార్గాలు, స్టేషన్ల ఆధునీకరణ, పరిశ్రమల అభివృద్ధికి ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. విశాఖపట్నం దేశంలోనే కీలక రైల్వే హబ్‌గా ఎదిగే దిశగా ఈ నిర్ణయం మైలురాయిగా నిలుస్తుందని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

# విశాఖ రైల్వే జోన్‌పై కేంద్రం గెజిట్.. మోదీ, చంద్రబాబుకు లోకేష్ ధన్యవాదాలు

**విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌పై గెజిట్ విడుదల**

**ఏపీ చిరకాల ఆకాంక్ష నెరవేరిందన్న మంత్రి నారా లోకేశ్**

**ప్రధాని మోదీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు కృతజ్ఞతలు**

**సీఎం చంద్రబాబు నిరంతర కృషితోనే ఇది సాధ్యమైందని వెల్లడి**

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే 05:**


విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, కనెక్టివిటీలో ఒక చారిత్రక ఘట్టమని ఆయన అభివర్ణించారు. రాష్ట్ర ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిన ఈ తరుణంలో ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాలు గణనీయంగా బలపడతాయని, రైళ్ల నిర్వహణ సామర్థ్యం కూడా పెరుగుతుందని లోకేష్ పేర్కొన్నారు. ఈ మైలురాయి ద్వారా ప్రాంతీయ అభివృద్ధి వేగవంతం అవుతుందని, కనెక్టివిటీ మెరుగుపడి ప్రజలకు కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ఆయన



ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రైల్వే జోన్ ఏర్పాటును సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం కృషి చేశారని నారా లోకేష్ గుర్తుచేశారు. ఆయన పట్టుదల వల్లే ఈ కల నెరవేరిందని, ఇందుకుగాను ముఖ్యమంత్రికి తన హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు లోకేష్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

## పాడేరు లో ఘనంగా మోదకొండమ్మ జాతర

### జిల్లా యంత్రాంగం సిద్ధం




**అల్లూరి జిల్లా, సిటిజన్ టైమ్స్, మే :05**

ఈ నెల 17, 18, 19 తేదీలలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మోదకొండమ్మ అమ్మవారి రాష్ట్ర పండుగను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తోంది. ఈ మేరకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి గారు జిల్లా కలెక్టర్, పోలీస్ సూపరింటెండెంట్ మరియు ఇతర అధికారులతో కలిసి పండుగ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. పండుగ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, రవాణా, వైద్య, భద్రతా మరియు మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించారు. భక్తుల సౌకర్యార్థం అదనంగా 100 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీరు, ఆహారం, విశ్రాంతి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. పారిశుద్ధ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయబడుతున్నాయి. 24 గంటల వైద్య శిబిరాలు, ఓఆర్ఎస్ మరియు అత్యవసర మందులు అందుబాటులో ఉంచుతున్నారు. భద్రత పరంగా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాలు, ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ, నిరంతర విద్యుత్ సరఫరా కూడా కల్పిస్తున్నారు. మొత్తం మీద భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణంలో పండుగను నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమగ్రంగా ఏర్పాట్లు చేస్తోంది.

## గోస్తని గడ్డకు మోక్షం

### – గంటా చొరవతో ప్రజలకు ఊరట



**తగరపువలస, సిటిజన్ టైమ్స్, మే :5**

ఒకప్పుడు వందలాది కుటుంబాలకు జీవనాధారంగా నిలిచిన తగరపువలస గోస్తని గడ్డ, కాలక్రమేణా మురుగు నీటితో నిండిపోయి స్థానికులకు శాపంగా మారింది. అయితే ఈ దీర్ఘకాల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవతో గడ్డ పూడికతీత పనులు వేగంగా పూర్తి చేయడంతో వార్డు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. జీవీఎంసీ 1వ వార్డు పరిధిలోని ఈ గడ్డలో తగరపువలస పరిసర ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు గోస్తని నదికి చేరడం ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోంది. ఒకప్పుడు ఈ నీటిని ఉపయోగించి రైతులు జనపనార సాగు చేసి, చిట్టివలస జూట్ మిల్లుకు సరఫరా చేసి జీవనోపాధి పొందేవారు. కానీ కాలానుగుణంగా సాగు తగ్గిపోవడం, గడ్డలో పూడిక పేరుకుపోవడంతో నీటి ప్రవాహం నిలిచిపోయింది. దీంతో మురుగు నీరు వెనక్కి తిరిగి ఇళ్లలోకి చేరి స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగించింది. ఈ సమస్యను గమనించిన 1వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తమ్మిన సూరిబాబు, విషయాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఎమ్మెల్యే వెంటనే స్పందించి, కార్పొరేషన్ అధికారులను అప్రమత్తం చేశారు. ఆయన ఆదేశాల మేరకు యంత్రాలను రంగంలోకి దించి, తమ్మిన సూరిబాబు ఆధ్వర్యంలో గడ్డలో పేరుకుపోయిన పూడిక, మట్టిని తొలగించారు. నీరు సాఫీగా ప్రవహించేలా మార్గాలను శుభ్రపరిచారు. ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న సమస్యకు తక్షణ పరిష్కారం లభించడంతో స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ ఆరోగ్యాన్ని, నివాసాలను కాపాడినందుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, వార్డు అధ్యక్షుడు తమ్మిన సూరిబాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

## జూన్ 9 వరకు కిశోరి వికాసం కార్యక్రమాలు.. సిడిపిఓ

**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మే 5**

సఖినేటిపల్లి మండలంలో లోని అన్ని గ్రామాల్లో జూన్ 9 వరకు కిశోరి వికాసం కార్యక్రమాలు జరుగుతాయని సిడిపిఓ సి.హెచ్.ఇందిర పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సిడిపిఓ ఇందిరా మాట్లాడుతూ కిశోర బాలికలు తమ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకొని ఉన్నత స్థితికి చేరుకునే విధంగా బాలికలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలు మే 1వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు ప్రతి మంగళవారం, శుక్రవారం జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ వై. విజయభారతి, మహిళా పోలీసు అనిలా, అంగన్వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.



## పట్టణంలో ప్రారంభమైన జనగణన

### జనగణన పకడ్బందీగా నిర్వహించాలి
### - మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్



**అమలాపురం సిటిజన్ టైమ్స్ మే 5**

జనగణన -2027 లో భాగంగా అమలాపురం పురపాలక సంఘం పరిధిలోని మహిపాల వీధి స్వర్ణ వార్డు పరిధిలోని సమతా నగర్ లో మొదటిగా గృహ గణనను మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ గ ఆదేశాలతో సూపర్ వైజర్ యూ.ఎస్. వో గుత్తుల శ్రీహరి, ఎన్యూమరేటర్ కె. మురళీ కృష్ణ ప్రారంభించారు. సమతా నగర్ లోని ఇండ్లను సందర్శించి,గృహ గణన నిర్వహించి,గృహాలలో వసతులను గృహ యజమానులను అడిగి ,డిజిటల్ గా నమోదు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ మాట్లాడుతూ ఎన్యూమరేటర్లు జనగణనను అత్యంత పారదర్శకంగా,పకడ్బందీగా నిర్వహించాలని,ప్రతి ఇంటిని సందర్శించి,గణాంకాలు సేకరించాలని, నిర్ణీత గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఎన్యూమరేటర్లకు, సూపర్ వైజర్లకు సూచించారు. జనగణనకు సిబ్బంది ప్రతి ఇంటికి వస్తారని,సరైన సమాచారం ఇచ్చి,జనగణనకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

## రాజేందర్ మృతి అనుమానాస్పదంగా కేసు నమోదు



**కలికిరి సిటిజన్ టైమ్స్ మే 5**

సినీ గేయ రచయిత చంద్రబోస్ సోదరుడు రాజేందర్ మృతి అనుమానాస్పదమని తన భార్య వసంత దిండిగల్ పోలీస్ స్టేషన్లో జీరో ఎఫ్ ఐ ఆర్ నమోదు ను కలికిరి పిఎస్ నందు ఎఫ్ ఐ ఆర్ నమోదైనది ఆదివారం కలికిరి స్టేట్ బ్యాంకు కూడలి నందు అకస్మాత్తుగా రాజేందర్ కింద పడి మృతి చెందారు. వారి బంధువులు హైదరాబాదుకు మృతదేహాన్ని తీసుకొని పోయినారు తన భార్య వసంత శరీరంపై గాయాలు ఉన్నాయని అనుమానాస్పదమైన దిండిగల్ పోలీస్ స్టేషన్ నందు జీరో ఎఫ్ ఐ ఆర్ నమోదై కలిగిరికి ట్రాన్స్ఫర్ అయి అనుమానాస్పద మృతిగా కలికిరిలో కేసు నమోదు అయినది.

## నిరుపేద కుటుంబాలకు ఆపదలో అండగా

### ముఖ్యమంత్రి సహాయనిధి
### శాసనసభ్యులు వనమాడి కొండబాబు




**కాకినాడ( సిటిజన్ టైమ్స్)మే 5:**

నిరుపేద కుటుంబాలకు ఆపదలో అండగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరి అయిన 33 కుటుంబాలకు సుమారు 37, 67,000 రూపాయల చెక్కులను మంగళవారం శాసనసభ్యులు వారి స్వగృహం నందు నిర్వహించిన కార్యక్రమంలో బాధిత కుటుంబాలకు శాసనసభ్యులు వనమాడి కొండబాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ పేద వర్గాలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తోందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పాలన సాగిస్తుందని, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలో అర్హులైన ప్రతి నిరు పేద కుటుంబానికి మెరుగైన వైద్య సదుపాయం అందించడంతోపాటు వారి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, బచ్చు శేఖర్, ఒమ్మి బాలాజీ, అంబటి చిన్న, అమన్ జైన్, నెక్కంటి శ్రీనివాస్, బోనెపల్లి శ్రీనివాస్, పిర్ల లక్ష్మీ ప్రసన్న, నురుకుర్తి మోహన్, మేడిశెట్టి చిన్ని, పాలిక నాని, మల్లాడి ఏడుకొండలు, సంఘాని నాగూర్, అరదాడి శివ, బొద్దు శివాజీ, కొనాడ ప్రకాష్, గెద్దం పూర్ణచంద్రశేఖర్, కోడూరు కుమారస్వామి, రెడ్డనం సత్తిబాబు, దేంగేటి సతీష్, పొంగ బుజ్జి, రిక్కా సంజీవ్, నీలకాయల సన్నీ కిరణ్, బొల్లోజు ఉమా, సతీష్, గుమ్మల్ల వెంకటేశ్వరరావు, ఎర్రిపిల్లి సత్తిబాబు, చోడుపిల్లి ప్రేమ్, అద్దేపల్లి గంగరాజు, తుమ్మల సతీష్, రాళ్లపూడి ప్రకాష్, పాలిక సూర్య, పంది సతీష్, ముడే రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.


# నాగర్ కర్నూల్ మున్సిపాలిటీలోని 11వ వార్డులో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులు

### నరకప్రాయంగా 11వ వార్డు

### చెత్త కుప్పల మధ్య జనం.. పట్టించుకోని కౌన్సిలర్!











**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఏప్రిల్ 5**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని 11వ వార్డు సమస్యల వలయంలో చిక్కుకుంది. అభివృద్ధి మాట దేవుడెరుగు.. కనీస పారిశుధ్యం కూడా కరువైందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డ్రైనేజీలా.. చెత్త కుప్పలా? వార్డులోని డ్రైనేజీ కాలువలు సిల్టుతో, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి దర్శనమిస్తున్నాయి. నీరు పారే దారి లేక దుర్వాసన వెదజల్లుతున్నాయి.

**కనిపించని కౌన్సిలర్:** ఎన్నికల సమయంలో ఓట్ల కోసం తిరిగిన కౌన్సిలర్, ఇప్పుడు వార్డు సమస్యల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

**ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్:** తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్ చిన్నారులకు, వృద్ధులకు మృత్యుపాశాలుగా మారాయి. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?

**రోగాలకు నిలయంగా వార్డు:** ఎటు చూసినా పేరుకుపోయిన చెత్తాచెదారం, నిలిచిపోయిన మురుగు నీటి వల్ల దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ?పొదల వలన పాములు క్రిమి కీటకాలు వస్తున్నాయి అని ఆందోళన చెందుతున్నారు

సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని జనం వణుకుతున్నారు.

**శిథిలమైన గోడలు - అపరిశుభ్రత:** పాడుబడిన ఇళ్లు, శిథిలాల మధ్యే చెత్తను పారవేస్తుండటంతో వార్డు మొత్తం ఒక భారీ డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోంది.

**మున్సిపల్ అధికారులు నిద్రపోతున్నారా?:** వార్డులో పారిశుధ్య కార్మికుల పర్యవేక్షణ శూన్యమని, అధికారులు ఏసీ గదులకే పరిమితమయ్యారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇప్పటికైనా స్థానిక 11 వ కౌన్సిలర్ మరియు మున్సిపల్ అధికారులు స్పందించి, యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు చేపట్టాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

## వేసవిలో పాడి పశువుల సంరక్షణకు బంగారు పంచ సూత్రాలు

### జిల్లా పశుసం వర్ధక శాఖ అధికారి విజయరెడ్డి




**అమలాపురం సిటిజన్ టైమ్స్ మే 5**

వేసవి కాలంలో పెరుగు తున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా మూగ జీవాలను వడదెబ్బ నుండి కాపాడుకోవాలని కోనసీమ జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎల్. విజయ రెడ్డి రైతులకు విజ్ఞప్తి చేశారు. పశువుల ఆరోగ్యం మరియు పాల దిగుబడి తగ్గకుండా ఉండటానికి పంచ బంగారు సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. నిరంతర తాగునీటి సదుపాయం ఉండాలని పశువులకు 24 గంటలూ పరిశుభ్రమైన, చల్లని నీరు అందుబాటులో ఉంచా లన్నారు.వేసవిలో ఒక్కో పశు వు రోజుకు సుమారు 100 లీటర్ల వరకు నీటిని తాగుతుందన్నారు. కాబట్టి నీటి తొట్టెలు ఎప్పుడూ నిండుగా ఉండేలా చూడాలన్నారు. సరైన వసతి -చల్లని ఆవాసం ఉండాలన్నారు.పాకల పైన గడ్డి, టార్పాలిన్ లేదా షేడ్ నెట్‌లను వేయాలన్నారు.పాకల చుట్టూ తాటి ఆకులు లేదా గడ్డితో తడకలు కట్టి చల్లదనాన్ని కల్పించవచ్చునన్నారు. మధ్యాహ్నం 12 నుండి సాయంత్రం 4 గంటల వరకు పశువులను ఎండలోకి వదలరాదన్నారు.గాలి వెలుతురు ధారాళంగా వచ్చే గోశాలలు లేదా దట్టమైన చెట్ల నీడలో పశు వులను ఉంచా లన్నారు. ఆహార నియమాలు ఫీడింగ్ మేనేజ్‌మెంట్ ఉండాలన్నారు.సమయపాలన పాటి స్తూ మేత, దాణాను కేవలం ఉదయం 6-9 గంటల మధ్య, సాయంత్రం 5-8 గంట ల మధ్య మాత్రమే ఇవ్వాల న్నారుఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు మేత ఇవ్వడం వల్ల జీర్ణ క్రియలో ఇబ్బందులు కలిగి పశువు అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉందన్నా రు.తేలికగా జీర్ణమయ్యే పచ్చిగడ్డి, పొట్టు, మిశ్రమ ఆహారం అందించాలన్నారు.పోషకాలు ఖనిజ లవణాలు వడదెబ్బ తగలకుండా ఉండ టానికి ప్రతిరోజూ దాణాలో 30 గ్రాముల ఉప్పు ,50 గ్రాముల మినరల్ మిక్చర్ ఖనిజ లవ ణాల మిశ్రమం తప్ప నిసరిగా కలపాలన్నారు.స్నానం మరియు ప్రథమ చికిత్స రోజుకు కనీసం 1-2 సార్లు చల్లని నీటితో స్నానం చేయించడం లేదా పశు వుల శరీరంపై నీళ్లు చల్లడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గుతుందన్నారు ఒకవేళ పశువు ఆయాస పడటం, నోటి నుండి జొల్లు కార్చడం, నాలుక బయట పెట్టడం లేదా మేత మానే యడం వంటి లక్షణాలు కనిపిస్తే. వెంటనే నీడకు చేర్చి, శరీరంపై నీళ్లు పొయ్యాలన్నారు అత్య వసర పరిస్థితుల్లో తక్షణ సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1962 కి ఫోన్ చేయాలి లేదా దగ్గరలోని పశువైద్యుడిని సంప్రదిం చాలన్నారు.పశువులు మన కుటుంబ సభ్యులతో సమానమని. ఈ జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రాణ నష్టాన్ని నివారించ డమే కాకుండా, పాల దిగుబడి తగ్గకుండా ఆర్థిక లాభాలను పొందవచ్చునని డాక్టర్ విజయ రెడ్డి పేర్కొన్నారు.

## ఎనిమిదవ పోషకాహార పక్షోత్సవాలు



**కాకినాడ జిల్లా, రూరల్ సిటిజన్ టైమ్స్, మే 5**

తాళ్ళరేవు ప్రాజెక్టు కాజులూరు మండలం కోలంక సెక్టార్ పల్లెపాలెం అంగన్వాడి సెంటర్ ప్రాంగణంలో మంగళవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆరోగ్యశాఖ,విద్యాశాఖ సమన్వయంతో ఐసిడిఎస్ సిబ్బంది పోషకాహార ప్రదర్శన, ప్రీస్కూల్ కిట్టు ప్రదర్శన, పిల్లలకి ఏమైతే పెట్టకూడదో వాటికి సంబందించిన జంక్ ఫుడ్ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా కోలంక సెక్టార్ ఐసిడిఎస్ సూపర్వైజర్ సిహెచ్ నాగలక్ష్మి మాట్లాడుతూ బయట మార్కెట్లో నిల్వ ఉన్న ప్యాకెట్ లోని చిరుతిళ్లు పిల్లలకు తినిపిస్తే కలిగే నష్టాలను తల్లులకు వివరించారు. పిల్లల పోషకాహారం పట్ల తల్లి శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రెండేళ్లలోపు పిల్లల మానసిక ఎదుగుదల 80 నుండి 85 శాతం జరుగుతుందని, సరైన సమయంలో సరైన పోషకాహారం అందించడం వలన పిల్లల శారీరక మానసిక ఎదుగుదల సక్రమంగా జరిగి, ఇతర పిల్లలతో పోటీ పడేందుకు సిద్ధంగా ఉంటారని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రంలో అందించే పోషకహారం, పూర్వప్రాథమిక విద్యా పిల్లలకు అందించటం వలన నాణ్యమైన మానవ వనరులు సమాజానికి అందించవచ్చునని ఆమె పెర్గోన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి అప్పారావు మాట్లాడుతూ అంగన్వాడీ సిబ్బందిచే ఏర్పాటు చేయబడిన పోషకాహార ప్రదర్శన వలన తల్లులు వారి పిల్లలకు ఏ విధంగా తయారు చేసి పెట్టాలో వారికి సులువుగా అర్థం అవుతుందని, ఈ కార్యక్రమాన్ని వారి పాఠశాల నందు నిర్వహించినందుకు ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తల్లి గర్భం నుండి బిడ్డకు రెండేళ్లు నిండే వరకు ఉన్న వెయ్యి రోజులు పోషకాహార లోపం లేకుండా చూసుకోవడం ఎంతో కీలకమని అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది విజయ, అంగన్వాడీ సిబ్బంది కళ్యాణి, లక్ష్మి, సుజాత, వరలక్ష్మి, చంద్రకళ, ఆశా కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్సి ఫలితాలలో పాఠశాల టాపర్సకు సత్కారం...



**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మే 5**

అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం గ్రామంలో ఎనుముల నరసింహమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలలో 571, 565 మార్కులు సాధించి నూటికి నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణత ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు సత్యవతి ఆధ్వర్యంలో స్కూల్ చైర్మన్ కుంచె గంగాచలం గ్రామ పెద్దల సమక్షంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు దూశాలువలతో చిరు సత్కరించడమైనది.

## ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు.. ఏం ఈ ఓ లు..

**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మే 5**

ప్రభుత్వపాఠశాలల్లో పదవ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు అందిస్తున్నాయని, ప్రయివేట్ పాఠశాలకంటే ప్రభుత్వ బడుల్లో చదువుట మేలను సఖినేటిపల్లి విద్యాశాఖ అధికారులు తెలిపారు. మంగళవారం సఖినేటిపల్లి మండల విద్యాశాఖ అధికారులు డి కిషోర్ కుమార్, యం వేంకటేశ్వర రావుల ఆధ్వర్యంలో సఖినేటిపల్లి మండలం మోరి గ్రామం మహా లక్ష్మమ్మ ఆలయం వద్ద మోడల్ ప్రైమరీ స్కూల్, మోరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు సంయుక్తంగా బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వము విద్యార్థులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఉచిత సౌకర్యాలు కల్పిస్తుందని, ఇంటింటికి తిరిగి ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించి, ఇంటింటా ప్రచారం చేశారు. 10వ తరగతి లో అత్యధిక మార్కుల విద్యార్థుల ఫోటోలతో కూడిన ఫ్లెక్సీలు చూపిస్తూ, ఆటోలు ద్వారా గ్రామం అంతా ప్రచారం చేశారు. దూర ప్రాంతాల విద్యార్థుల కోసం ఉచిత ఆటో సౌకర్యం ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. పలువురు విద్యార్థులను ప్రైమరీ హై స్కూల్ లలో జాయిన్ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పి. లక్ష్మీ పద్మ మంగతాయారు, ఎంపిటిసి జాన సూర్యవతి, ప్రధానోపాధ్యాయులు శ్రీదర్ కృష్ణ, నాగార్జున రావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్స్, ప్రజా ప్రతినిధులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# 42వ రోజు కొనసాగిన సెక్యూరిటీ గార్డ్స్ రిలే నిరాహారదీక్ష




**కాకినా(సిటిజన్ టైమ్స్) మే 5**

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి మరియు రంగరాయ వైద్య కళాశాలలో సెక్యూరిటీ సేవలందిస్తున్న కార్మికులకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీతాలు పెంచాలని, క్యాజువల్ లీవులు అమలు చేయాలని, అక్రమంగా విధులకు దూరం చేసిన గార్డ్స్ ని డ్యూటీలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో జిజిహెచ్ సెక్యూరిటీ కార్యాలయం వద్ద మార్చి 25 న ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు 42వ రోజైన మంగళవారం కూడా నిర్వహించారు. సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ సోమవారం సాయంత్రం కార్మిక శాఖ కార్యాలయంలో జాయింట్ మీటింగ్ జరిగిందన్నారు. ఎఎల్ఓ కార్తీక్ సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ స్థానిక ఇంచార్జ్ శ్రీనివాస్ లు పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్ సమావేశం లో మాట్లాడుతూ కార్మికుల జీతాలు, సౌకర్యాలు ఎంఓయు ప్రకారం అమలు చేస్తున్నారా, అందుకు సంబంధించిన వివరాలు జిజిహెచ్ ఆర్ఎంసి అధికారులకు తెలియచేయాలని సెక్యూరిటీ కాంట్రాక్ట్ సంస్థ కు 14 నోటీసులు ఇచ్చామన్నారు. సిఐటియు తరపున హాజరైన వారు మాట్లాడుతూ కాంట్రాక్టు ప్రారంభమై ఏడాది కావస్తున్నా జీతం కేవలం 12,099/- మాత్రమే ఇస్తున్నారని, ఎంఓయు ప్రకారం 13,960/- చెల్లించాలన్నారు. గతం నుండి అమలవుతున్న 13 క్యాజువల్ లీవులు ఈ కాంట్రాక్టు వచ్చాక రద్దు చేసి జీతంలో కోత విధిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా కార్మికులు పే స్లిప్ అడిగినా ఇవ్వడం లేదన్నారు. కొంతమంది సెక్యూరిటీ గార్డ్స్ సిఐటియు ఆధ్వర్యంలో యూనియన్ ఏర్పాటు చేసుకోవడం వల్ల కక్ష్య సాధింపు గా 5 గురిని విధులకు దూరం చేసారని తెలిపారు. ఈ సందర్భంగా ఎఎల్ఓ కార్తీక్ మాట్లాడుతూ విధులకు దూరం చేసిన వారిని తక్షణమే విధుల్లోకి తీసుకుని, జీతాలు చెల్లించాలని ఆదేశించారు. తదుపరి వాయిదా 11 వ తేదీకి వేసారని వీరబాబు తెలిపారు. కార్తికేయ యాజమాన్యం తరపున శ్రీనివాస్ మాట్లాడుతూ 2 రోజుల్లో కార్మికులకు సమాధానం చెబుతామని తెలిపారు. యూనియన్ అధ్యక్షుడు లంకే ధర్మ మాట్లాడుతూ పెరిగిన ధరలతో సెక్యూరిటీ గార్డ్స్ చాలా ఇబ్బందులు పడుతున్నారని, జిఓ ప్రకారం జీతాలు చెల్లించాలని, క్యాజువల్ లీవులు అమలు చేయాలని, పే స్లిప్ ఇవ్వాలని కోరుతున్నామన్నారు. జిల్లా కలెక్టర్ వారి స్పందన పట్ల ధన్యవాదాలు తెలిపారు. 42వ రోజు దీక్షల్లో సెక్యూరిటీ గార్డ్స్ లంకే ధర్మ, కె.భాగ్యలక్ష్మి, శేరు దుర్గ, పోతుల దేవి, ఎస్. శివగంగ లు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో బాలరాజు, శ్రీనివాస్, సోమరాజు , ఎం. రవి , కృష్ణ, ప్రసాద్ , సత్యవతి , దుర్గా ప్రసాద్, చెక్కా ధర్మారావు, కృష్ణవేణి, షఫీ ఖాన్, ధనలక్ష్మి, దేవి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు కస్టడీకి ఎమ్మెల్సీ అనంతబాబు



**కాకినాడ (సిటిజన్ టైమ్స్)మే 5:**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సంచలనం సృష్టించిన డ్రైవర్ వీధి సుబ్రమణ్యం హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబును పోలీసులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. సాక్షులను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారనే ఆరోపణలపై నమోదైన కేసులో భాగంగా ఈ విచారణ కొనసాగుతోంది. ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న అనంతబాబును కోర్టు అనుమతితో పోలీసులు మంగళవారం కాకినాడకు తరలించారు. భారీ భద్రత నడుమ ఆయనను రాజమండ్రి నుండి కాకినాడ రూరల్ పరిధిలోని సర్పవరం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. సాక్షులను బెదిరించడం, ఆధారాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారనే అభియోగాలపై లోతుగా విచారించాల్సిన అవసరం ఉందని పోలీసులు కోర్టును కోరారు. దీనికి స్పందించిన మొబైల్ కోర్టు అనంతబాబును 24 గంటల పాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు ఆధ్వర్యంలో అనంతబాబు విచారణ కొనసాగుతోంది. సాక్షులకు ఫోన్ చేసి బెదిరించినట్లు వచ్చిన ఆరోపణలపై పోలీసులు ఆయనను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఆయన ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు కాల్ డేటా ఆధారంగా కీలక ఆధారాలను సేకరించే పనిలో పడ్డారు. కస్టడీ ముగిసిన అనంతరం బుధవారం తిరిగి ఆయనను కోర్టులో ప్రవేశపెట్టి రాజమహేంద్రవరం జైలుకు తరలించనున్నారు.

## దళితుని భూమి కబ్జాపై ఎస్సీ కమిషన్ విచారణ

**భీమిలి, సిటిజన్ టైమ్స్, మే:5**

భీమిలి మండలం చేపలుప్పాడలో దళితునికి చెందిన భూమి కబ్జా ఆరోపణలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు మంగళవారం విచారణ చేపట్టారు. కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్ ఆదేశాల మేరకు సభ్యులు మేకల భిక్షం, రావాడ సీతారాం సంఘటనా స్థలాన్ని సందర్శించి ఇరు పక్షాల వాదనలు పరిశీలించారు. బాధితుడు టి. అప్పలకొండ తెలిపిన వివరాల ప్రకారం, సర్వే నంబర్ 51లో సుమారు 3 ఎకరాల భూమిని తమ పూర్వీకులు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. తాను ఉపాధి నిమిత్తం బయట ఉండగా, విశాఖకు చెందిన కె. వెంకటరమణ మూర్తి అక్రమంగా భూమిని ఆక్రమించి ఫెన్సింగ్ వేసినట్లు ఆరోపించారు. ఈ విషయంపై ప్రశ్నించగా దాడులు, బెదిరింపులు జరిగినట్లు తెలిపారు. ఇప్పటికే రెవెన్యూ, పోలీసు అధికారులకు పలు ఫిర్యాదులు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని కమిషన్ గమనించింది. ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయడంలో ఆలస్యం జరిగినట్లు అభిప్రాయపడింది. భూమికి సంబంధించి పలుమార్లు సర్వేలు జరిగినప్పటికీ స్పష్టమైన సర్వే సర్టిఫికేట్ ఇవ్వకపోవడం వల్ల సమస్య కొనసాగుతోందని కమిషన్ సభ్యులు పేర్కొన్నారు. దళితుల భూములు, హక్కుల రక్షణ అత్యంత ప్రాధాన్యతగా తీసుకుంటామని, బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విచారణ నివేదికను కమిషన్ చైర్మన్‌కు సమర్పించి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ విచారణలో భీమిలి తహశీల్దార్, స్థానిక ఎస్ఐ సహా ఇరు వర్గాలు పాల్గొన్నారు.



# గ్రామపంచాయతీ ఇంటి పన్నుల రాయితీలకు విశేష స్పందన

### ఐదు రోజుల్లో రూ.2.19 కోట్లు వసూళ్లు

**అమలాపురం ( సిటిజన్ టైమ్స్ ) 5 మే**

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖలో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులకు విశేష స్పందన వస్తుంది. పట్టణాల తరహాలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మే నెలలో ఇంటి పనులు చెల్లిస్తే ఐదు శాతం రాయితీ విధానాన్ని అమలు చేసారు. ఈ నెల ఒకటి నుంచి ప్రారంభమైన ఈ పన్నుల వసూళ్లకు అనేకమంది ఇల్లు,సంస్థల యజమానులు ముందుకు వస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఈ ఐదు రోజుల్లో రూ.2.19 కోట్లు వసూళ్లు అవడం విశేషం. జిల్లాలో ఈ కొత్త ఆర్థిక సంవత్సానికి సంబంధించి రూ.129.55 కోట్లు డిమాండ్ గా నిర్ణయించారు. ఇందులో ఈ సంవత్సరం తో పాటు పాత సంవత్సరాల బకాయిలు కూడా ఉన్నాయి. 2025-26 సంవత్సరానికి ఈ జిల్లాలో ఇంటి పన్నుల డిమాండ్ రూ.141.99 కోట్లుగా ఉంది. అయితే ఆ సంవత్సరం నుంచి ప్రారంభమైన స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా ఆన్ లైన్ లో ఇంటి పన్నులు వసూళ్ళుకు విశేష స్పందన వచ్చింది. మార్చి 31 నాటికి రూ.101.3 కోట్లు వసూలు అయింది. ఈ జిల్లాకు సంబంధించి పలు సంస్థలు ఇంటి పన్నులపై కోర్టుకు వెళ్లడం వల్ల 71.34 శాతం మాత్రమే వసూలు అయింది.ఇంతకు ముందు సంవత్సరాలలో అరవై శాతం వసూళ్లు అవ్వడం కష్టంగా ఉండేది.గత ఏడాదికి బకాయిలుగా ఉన్న రూ.40.69 కోట్లు కలుపుకొని ఈ ఏడాది 129.55 కోట్లు వసూలు చేయవలసి ఉంది. గతంలో ఇంటి పన్నుల రసీదు పుస్తకాలు ముద్రించి సెప్టెంబరు, అక్టోబర్ నెలల్లో వసూళ్లు ప్రారంభించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి ఏమి లేదు. పూర్తిగా ఆన్ లైన్ లోనే ఎవరు కట్టాలి అనేది స్పష్టంగా నమోదైంది. అందువల్ల ఇంటి పన్నుల వసూళ్లు విధానం సౌకర్యవంతమైంది.ఇంటి వద్దనే సెల్ ఫోన్ ద్వారా కరెంట్ బిల్లు మాదిరిగా ఈ స్వర్ణ పంచాయతీ పోర్టల్ లో ఇంటి పన్నులు చెల్లించుకోవచ్చు.ఈ సొమ్ములు దుర్వినియోగం అయ్యే అవకాశాలు లేకుండా పోయాయి. ఆన్ లైన్లో చెల్లించిన ప్రతి రూపాయి ఆయా గ్రామ పంచాయతీల నిధులకు జమవుతున్నాయని జిల్లా పంచాయతీ అధికారిణి వి.శాంతా మణి తెలిపారు.జిల్లా కలక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గ్రామ పంచాయతీలలో ప్రభుత్వం కల్పించిన ఇంటి పన్ను రాయితీ విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టారు.



## ప్రపంచంలోనే అరుదైన గొంతు శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించిన మెడికవర్ హాస్పిటల్స్, కాకినాడ వైద్యులు




**కాకినాడ (సిటిజన్ టైమ్స్) మే 5**

మెడికవర్ హాస్పిటల్స్, కాకినాడలోని ఈఎన్‌టీ విభాగం వైద్యులు మరో అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి వైద్య రంగంలో తమ ప్రతిభను చాటుకున్నారు. కాకినాడ జిల్లాకు చెందిన ఎం దుర్గ అనే మహిళ గొంతుకు సంబంధించిన క్లిష్ట సమస్యతో బాధపడుతుండగా కాకినాడ మెడికవర్ హాస్పిటల్స్, వైద్యురాలు డా నికిత రెడ్డి గారు అత్యాధునిక పద్ధతులతో చికిత్స అందించి ఆరోగ్యవంతునిగా మార్చారు.ఈ సందర్భంగా ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ నిఖిత రెడ్డి గారు మాట్లాడుతూ, “మహిళ గొంతులో ఏర్పడిన అరుదైన కణితి కారణంగా శ్వాస తీసుకోవడంలో మరియు ఆహారం మింగడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూర్తి పరిశీలన అనంతరం, శస్త్రచికిత్సే ఉత్తమ మార్గమని నిర్ణయించి, మా నిపుణుల బృందంతో కలిసి విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించాం. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉంది,” అని తెలిపారు.ఇటువంటి సమస్యలను ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స సులభమవుతుందని, గొంతు సంబంధిత ఇబ్బందులు, శ్వాసలో ఇబ్బంది, దీర్ఘకాలిక గొంతు నొప్పి వంటి లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. మెడికవర్ హాస్పిటల్స్, కాకినాడ సెంటర్ హెడ్ ఎన్. అంజిబాబు మాట్లాడుతూ, “మా ఆసుపత్రిలో అత్యాధునిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందం ఉండటం వల్ల క్లిష్టమైన శస్త్రచికిత్సలను కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నాం. రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందించడం మా ప్రధాన లక్ష్యం,” అని తెలిపారు. ఈ విజయవంతమైన శస్త్రచికిత్సతో మెడికవర్ హాస్పిటల్స్, కాకినాడ మరోసారి తన విశ్వసనీయతను నిరూపించుకుంది.

# మండు వేసవిలో చల్లని ఓఆరెస్ పంపిణీ




**కాకినాడ (సిటిజన్ టైమ్స్) మే 5**

మండు వేసవికాలంలో నడిరోడ్డుపై బాటసారులకు దాహార్తిని తీర్చి శక్తిని కల్పించేందుకు నారా లోకేష్ యువజన ఫౌండేషన్ ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ పంపిణీ చేసింది. ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు మండపాక సుబ్బు సారధ్యంలో మేడిచర్ల శ్రీను మేడిచర్ల శ్రీదేవి జన్మదినశీ సందర్భంగా వారి కుమారులు పేదలకు,అన్న ఎన్టీఆర్ జనార్దన్ క్యారేజీ ద్వారా పేదలకు భోజన వసతి కల్పించారు.ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు బత్తుల సూర్యప్రసాద్ ప్రత్తిపాడు ఫౌండేషన్ అధ్యక్షులు అడపా జగదీష్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఏర్పర్చిన నారా వారి చలివేంద్రంలో సుమారు ఓఆర్ఎస్ ప్యాకెట్లు బాటసారులకు పంపిణీ జరిగింది. సుబ్బు మాట్లాడుతూ పుట్టినరోజున ఆర్భాటాలు లేకుండా పేదవారికి అండగా ఉండాలని సూచించారు. నెల్లూరులో జరుగబోయే మహానాడు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలాడి వెంకటేష్ కర్రి వీరబాబు గంధశీ గోపి పేర్ల సత్తిబాబు సంతోష్ ఫౌండేషన్ సభ్యులు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## పట్టపగలే వెలుగుతున్న హైమాస్ట్ దీపాలు - పట్టించుకోని అధికారులు!

### నిర్లక్ష్యానికి నిలువుటద్దం





**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఏప్రిల్ 5**

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ (జెడ్పీ) కార్యాలయ ఆవరణలో హైమాస్ట్ లైట్లు పట్టపగలే వెలుగుతూ విద్యుత్ వృథాకు కారణమవుతున్నాయి. సామాన్య ప్రజలకు విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించాల్సిన ప్రభుత్వ కార్యాలయాల్లోనే, అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ లైట్లు 24 గంటల పాటు నిరంతరాయంగా వెలుగుతున్నాయి. గాంధీ పార్క్, రైతు బజార్లలో అంధకారం: ఒకవైపు జెడ్పీ ఆఫీసులో లైట్లు అనవసరంగా వెలుగుతుంటే, గాంధీ పార్క్ మరియు రైతు బజార్ వంటి ప్రాంతాల్లో మాత్రం లైట్లు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నార్ను అవసరం లేని సమయంలో లైట్లు వెలిగించడం వల్ల విద్యుత్ బిల్లుల రూపంలో ప్రజాధనం వృథా అవుతోందని స్థానికులు మండిపడుతున్నారు. అధికారుల స్పందన ఏది? జిల్లా కేంద్రంలోనే ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి, విద్యుత్ వృథాను అరికట్టడంతో పాటు వెలగని చోట్ల లైట్లు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## అంతర్వేది నృసింహుని హుండీ లెక్కింపు... ఆదాయం 18.92 లక్షలు..





**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మే 5**

డా. బి. ఆర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానములో దేవదాయశాఖ తనిఖీదారు జే.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో ప్రధాన హుండీ, అన్నదానం, గుర్రాలక్క ఆలయం వద్ద గల హుండీలను ఆలయ సిబ్బంది లెక్కించారు. ఈ ఏడాది మార్చి 31వ తేదీ నుండి నేటి వరకు గల 36 రోజులకు ప్రధాన ఆలయ హుండి ద్వారా 18,61,780. అన్నదానం హుండి ద్వారా 19,560, గుర్రలక్క అమ్మవారి హుండీ ద్వారా 10,847. లతో కలిపి మొత్తం హుండీ ఆదాయం 18,92,187 వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసీ బైరా నాగరాజు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో ప్రతిభకు ఘన సత్కారం... ఎమ్మెల్యే దేవ.



**మలికిపురం, సిటిజన్ టైమ్స్, మే 05**

అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం లో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో రాపాక లైస్ ఇవాంజెలిన్ 600 మార్కులకుగాను 597 మార్కులు సాధించి, రాష్ట్రంలో మూడో స్థానం, జిల్లాలో మొదటి స్థానం దక్కించుకొని ప్రతిభ చాటారు. సఖినేటిపల్లి లో శ్రీ చైతన్య స్కూల్‌లో విద్యాభ్యాసం కొనసాగిస్తున్న విద్యార్థిని ఈ విజయంతో పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచారు. ఆమె తల్లితండ్రులు రాపాక శేఖర్ జ్యోతిల నేడు విశ్వేశ్వరాయపురం క్యాంపు కార్యాలయంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ లైస్ ఇవాంజెలిన్‌ను అభినందించి, చిరు సత్కారం నిర్వహించారు. ఈ విజయానికి తోడ్పడిన ప్రిన్సిపాల్ సతీష్ కుమార్, అధ్యాపక సిబ్బందికి ఎమ్మెల్యే దేవ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇలాంటి ప్రతిభావంతులైన విద్యార్థులు మరింత ముందుకు వెళ్లి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

# యార్డులో సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి...

### పుంత రోడ్ల నిర్మాణానికి పూనుకోవాలి...

### కొత్తపేట మార్కెట్ కమిటీ సమావేశంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...



**రావులపాలెం, సిటిజన్ టైమ్స్, మే 05**

అరటి మార్కెట్ యార్డు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దిశా నిర్దేశం చేశారు. మంగళవారం ఆయన రావులపాలెం అరటి మార్కెట్ యార్డు ను సందర్శించారు. ముందుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం యార్డులో సమస్యలను పరిశీలించారు. రైతు బజార్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. తదుపరి కొత్తపేట మార్కెట్ కమిటీ సమావేశంలో జిల్లా అధికారి ఏ డి ఏ విశాలాక్షి, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లి మంగాదేవి భీమారావు, వైస్ చైర్మన్ కంఠంశెట్టి శ్రీనివాసరావు మరియు పాలకమండలి సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన కమిటీ కార్యవర్గం రైతుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. పుంత రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు రావులపాలెం మార్కెట్ యార్డ్ అత్యంత కీలకమైన యార్డ్ అన్నారు. అరటి మార్కెట్ అంటేనే ఏ రోజు వ్యాపారం ఆరోజు జరిగిపోవాలన్నారు. రైతులు, సైకిల్ వెండర్లు, ఎగుమతి దారులు,ఎక్కడెక్కడ నుంచో వ్యాపారస్తులు వస్తారన్నారు. రోజుకి 40,50 లారీలు లోడై అనేక ప్రాంతాలకు ఎగుమతి అవుతాయన్నారు. 35 ఏళ్ల క్రితం అంతా దళారుల రాజ్యమే ఉండేదన్నారు. ధర దళారులు చెప్పిన రేటుకే కొనాలి, వాళ్ళ అమ్మమన్న రేటుకే అమ్మాలి, రైతులను కొట్టిన సందర్భాలు సైతం ఉన్నాయన్నారు. రైతుల మేలు కోసం అటువంటి సందర్భంలో యార్డు తీసుకురావడం జరిగిందన్నారు. ప్రస్తుతం యార్డులో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, శానిటేషన్ బాగుండడం లేదన్న మాటలు వినబడుతున్నాయన్నారు. సమస్యలన్నింటినీ పరిష్కరించి మార్కెట్ యార్డును అభివృద్ధి పరచాలన్నారు. రైతు బజారు నిర్మించి, బాగా అభివృద్ధి చేయాలన్నారు. కూరగాయలు పంటకు మన ప్రాంతంలో ఎప్పుడూ డిమాండ్ ఎక్కువగా ఉంటుందని, కూరగాయలు ఎక్కువగా పండించడం వల్ల రైతులకు ఆదాయం వస్తుందన్నారు. రైతులకు సైతం డిమాండ్ ఉన్న కూరగాయల పంటల సాగుపై అవగాహన కల్పించాలన్నారు.

# ఆశ వర్కర్స్‌కు వేతనాలు పెంచాలి

**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్, మే 05**

రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాథమిక వైద్యశాలల వద్ద ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధ సంఘం ఆశ వర్కర్ కు వేతనాలు పెంచాలని ఆశాడే సందర్భంగా నిరసనకు పిలిపి ఇవ్వడం జరిగింది. ఈ నిరసన కార్యక్రమం గిద్దలూరు మండలం సంజీరాయుని పేట, కిష్టం శెట్టిపల్లె ప్రాథమిక వైద్యశాల దగ్గర నిసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు బి జోష్మిని, ఎస్కే మెహనాజ్ మాట్లాడుతూ ఆశ వర్కర్లు గ్రామాలలో శిశు మరణాల సంఖ్య తగ్గించడంలో, మహిళలు ప్రభుత్వ హాస్పిటల్లో కాన్పులు చేయడంలో ఆశా వర్కర్స్ గ్రామస్థాయిలో కీలకపాత్ర పోషిస్తున్నారని, అతి తక్కువ వేతనంతోటి ఆశ వర్కర్స్ తోటి ఎక్కువ పనులు చేయిస్తున్నారని కనీసం సెలవులు కూడా లేకుండా ఆశా వర్కర్స్ అనేక రకాల సర్వేలు నిర్వహిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశ వర్కర్స్ తో చేయించుకుంటున్న పనులకు తగ్గ వేతనాలు ఇవ్వట్లేదని నిరసన వ్యక్తంచేశారు. ఆశా వర్కర్ కు వేతనాలు పెంచేంతవరకు దశలవారీగా ఆందోళన చేస్తామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కె రమాదేవి ఎస్ అంజలి బుజ్జి మేరీ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలసిన ఉలవపాడు మండల టెన్త్ టాపర్ లక్ష్మీ జస్వంతి

### అభినందించిన ఎమ్మెల్యే ఇంటూరి

**ఉలవపాడు, సిటిజన్ టైమ్స్, మే 05:**

ఉలవపాడు మండలం వీరేపల్లి గ్రామానికి చెందిన తాటితోటి సాయి లక్ష్మీ జస్వంతి టెన్త్ 2026 ఫలితాలలో ఏపీ మోడల్ స్కూలులో చదివి అత్యధికంగా 590/600 మార్కులు సాధించి ఉలవపాడు మండల టాపర్ గా నిలిచారు. దీనితో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని మరియు ఆమె తండ్రి ఏపీ మోడల్ స్కూల్ విద్యాకమిటీ చైర్మన్ తాటితోటి ప్రభాకరరావు మరియు స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు టెన్త్ మండల టాపర్ తాటితోటి సాయి లక్ష్మీ జస్వంతిని అభినందించి, శాలువాతో ఘనంగా సత్కరించి భవిష్యత్తులో బాగా చదివి మంచి కీర్తి గడించాలని ఆశీర్వదించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ మంచి మార్కులు తెచ్చుకోవడం గొప్ప విషయం అన్నారు. కూటమి ప్రభుత్వం ముఖ్యంగా మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టినదని, ప్రస్తుతం 2026 టెన్త్ ఫలితాలలో ప్రభుత్వ పాటశాలల విద్యార్థులు సాధించిన ఉత్తమ ఫలితాలే ఇందుకు



నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరేపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు కాకర్లపూడి ఆదినారాయణరాజు, మోదుగుల గురవయ్య, మరియు వీరెపల్లి ఏపీ మోడల్ స్కూల్ చైర్మన్ తాటితోటి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



# యువ క్రీడాకారిణులకు మంత్రి సుభాష్ రూ. 45 వేలు ఆర్థిక సహాయం

### జాతీయ స్థాయిలో మెరుగైన ప్రతిభ కనబరచాలని ఆకాంక్ష



**రామచంద్రపురం, సిటిజన్ టైమ్స్, మే 05:**

రాజమండ్రి రూరల్ ప్రాంతానికి చెందిన యువ గ్రామీణ క్రీడాకారిణులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడం గర్వకారణమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. యూత్ స్పోర్ట్స్ ఊ ఆక్టివిటీస్ అసోసియేషన్ (ఇండియా ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసా నేషనల్ లెవెల్ ఛాంపియన్షిప్ -2026 పోటీలు మే 22 నుండి 25 వరకు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని ధర్మశాలలో జరగనున్న నేపథ్యంలో ఈ పోటీలకు ఎంపికైన కె. శ్రీ లాస్య, కె. దుర్గ భవాని, ఎ. వెంకట కావ్య శ్రీ లను మంత్రి సుభాష్ అభినందించారు. ఈ సందర్భంగా రామచంద్రపురంలోని తన కార్యాలయంలో వారికి ఒక్కొక్కరికి రూ. 15,000 చొప్పున మొత్తం రూ. 45,000 ఆర్థిక సహాయం అందజేశారు. ముందుగా విద్యార్థినులు రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబును కలిసి ఆశీస్సులు తీసుకోగా, ఆయన ఈ విషయాన్ని మంత్రి సుభాష్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచే ఎంతో ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వస్తున్నారని, వారికి సరైన ప్రోత్సాహం, సహకారం అందితే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి కీర్తి తీసుకురాగలరని అన్నారు. రాష్ట్ర ఐటీ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని అభివృద్ధి చేయడానికి పలు పథకాలు, కార్యక్రమాలు అమలు అవుతున్నాయని వివరించారు. యువతలో క్రీడా చైతన్యం పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ శిబిరాలు, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఆర్థిక ప్రోత్సాహాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే, విద్యార్థులు ధైర్యంగా పోటీలు ఎదుర్కొని విజయాలు సాధించాలని ఆశిస్తూ, వారి తల్లిదండ్రులు, కోచ్‌లకు మంత్రి అభినందనలు తెలిపారు.

# కిసోరి వికాసం బాలిక బంగారు భవిష్యత్తుకు పునాది -సిడిపిఓ షేక్ ఆశాబేగం


**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్, మే 05**

కిషోరి వికాసం కార్యక్రమం ద్వారా బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని వెలిగండ్ల సిడిపిఒ షేక్ ఆశాబేగం అన్నారు మండల కేంద్రంలోని సి ఎస్ పురం పరిధిలో వడ్డేపాలెం అంగన్వాడి కేంద్రంలో మంగళవారం కిషోరీ వికాసం కార్యక్రమం ను సూపర్వైజర్ దేవకృపావరం ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వెలిగండ్ల సిడిపిఓ షేక్ ఆశాబేగం పాల్గొన్నారు కిషోరి బాలికలకు వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్య పరిరక్షణ, భావోద్వేగ నియంత్రణ, మరియు జీవన నైపుణ్యాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఓ షేక్ ఆశాబేగం మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో బాలికలు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారికి సరైన దిశానిర్దేశం అవసరమని తెలిపారు. తమ బలాలు, బలహీనతలను తెలుసుకొని స్వీయ అవగాహన పెంపొందించుకోవడం ద్వారా జీవితంలో విజయాలను సాధించవచ్చుని, కిషోరి బాలికలు చిన్న వయస్సు నుంచే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని, ఏ సమస్య వచ్చినా ధైర్యంగా ఎదుర్కొనే ధోరణి అలవర్చుకోవాలని సూచించారు. భావోద్వేగాలను అదుపులో ఉంచడం, కోపం, ఆందోళన వంటి పరిస్థితులను సమర్థంగా నియంత్రించడం ఎంతో కీలకమని చెప్పారు. సమాజంలో సురక్షితంగా ఉండాలంటే వ్యక్తిగత పరిమితులను తెలుసుకొని వాటిని పాటించడం తప్పనిసరిగా మారాలని , ఒత్తిడి పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనే నైపుణ్యం కలిగి ఉండాలని, చదువు కుటుంబం సమాజం వంటి విభిన్న రంగాలలో



ఎదురయ్యే ఒత్తిడిని సానుకూలంగా దృక్పథంతో అధిగమించాలని , సరైన నిర్ణయాలు తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో మంచి అవకాశాలను అందిపోర్చుకోవచ్చని అన్నారు స్వీయ విలువలు నైతిక విలువలను పాటించడం ద్వారా వ్యక్తిత్వం మరింత బలపడుతుందని ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవడం ద్వారా శారీరిక మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు ముఖ్యంగా బాలికలు పోషకాహారం పరిశుభ్రత మరియు ఆరోగ్య సంరక్షణ పై శ్రద్ధ పెట్టాలని సూచించారు ఈ కార్యక్రమంలో పోషణ అభియాన్ కోఆర్డినేటర్ గంధం సామ్యూల్, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# పొరపాట్లకు తావులేకుండా పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలి - సిసిఎల్ఏ ముఖ్య కమిషనర్ జి. జయలక్ష్మి



**ఒంగోలు, సిటిజన్ టైమ్స్, మే 05**

పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పటిష్టంగా పంపిణీ జరిగేలా చూడాలని సిసిఎల్ఏ ముఖ్య కమిషనర్ జి. జయలక్ష్మి, జిల్లా కలెక్టర్లకు సూచించారు. మంగళవారం ఉదయం రాష్ట్ర సచివాలయం నుండి రీ సర్వే, పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ, 22ఏ భూ సమస్యల పరిష్కారం, పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారం, రెవిన్యూ క్లినిక్ ల నిర్వహణ, తదితర అంశాలపై సిసిఎల్ఏ జయలక్ష్మి , రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా ముఖ్య కమిషనర్ జయలక్ష్మి మాట్లాడుతూ, పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీకి సంబంధించి మే నెలలో నిర్దేశించిన మేర పంపిణీ చేయాలనీ, జూన్, నెలల పంపిణీ చేయవలసిన పట్టాదార్ పాస్ పుష్కరాలకు సంబంధించి రైతుల వివరాలు, విస్తీర్ణం, తదితర అంశాలపై సమాచారం సిద్ధం చేసుకుని, పట్టాదార్ పాస్ పుస్తకాల ప్రచురణకు ముందు వివరాలను సరిచూసుకోవాలన్నారు. 22ఏ భూ సమస్యల పరిష్కారంలో నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూములకు సంబంధించి ఉన్న మార్గదర్శకాలను, కాలానుగుణంగా జారీచేసిన ప్రభుత్వ ఉత్తర్వులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పిజిఆర్ఎస్, రెవిన్యూ క్లినిక్ లలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫెరెన్స్ కు ఒంగోలు కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పాల్గొని జిల్లాలో మే నెలలో పట్టాదార్ పాస్ పుస్తకాలకు ఈ-కేవైసి పూర్తి చేసి రైతులకు పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాట్లు వివరించారు. పిజిఆర్ఎస్, రెవిన్యూ క్లినిక్ లలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి ధరఖాస్తుదారులతో వారి సమస్యలను రెవిన్యూ అధికారులు స్వయంగా అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్, సిసిఎల్ఏ ముఖ్య కమిషనర్ తెలిపారు.

# మాజీ సిఎం నాదేండ్లకు నివాళులు



**ఒంగోలు, సిటిజన్ టైమ్స్, మే 05**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత నాదెండ్ల భాస్కరరావు చిత్రపటానికి ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. హైదరాబాదులోని నాదెండ్ల భాస్కరరావు నివాసంలో ఆయన తనయుడు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ను పరామర్శించారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు వెంట ఒంగోలు ఓడా చైర్మన్ షేక్ రియాజ్ ఉన్నారు.



# ఆశ వర్కర్స్‌కు వేతనాలు పెంచాలి



**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్, మే 05**

రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాథమిక వైద్యశాలల వద్ద ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధ సంఘం ఆశ వర్కర్ కు వేతనాలు పెంచాలని ఆశాడే సందర్భంగా నిరసనకు పిలిపి ఇవ్వడం జరిగింది. ఈ నిరసన కార్యక్రమం గిద్దలూరు మండలం సంజీరాయుని పేట, కిష్టం శెట్టిపల్లె ప్రాథమిక వైద్యశాల దగ్గర నిసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు బి జోష్మిని, ఎస్కే మెహనాజ్ మాట్లాడుతూ ఆశ వర్కర్లు గ్రామాలలో శిశు మరణాల సంఖ్య తగ్గించడంలో, మహిళలు ప్రభుత్వ హాస్పిటల్లో కాన్పులు చేయడంలో ఆశా వర్కర్స్ గ్రామస్థాయిలో కీలకపాత్ర పోషిస్తున్నారని, అతి తక్కువ వేతనంతోటి ఆశ వర్కర్స్ తోటి ఎక్కువ పనులు చేయిస్తున్నారని కనీసం సెలవులు కూడా లేకుండా ఆశా వర్కర్స్ అనేక రకాల సర్వేలు నిర్వహిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశ వర్కర్స్ తో చేయించుకుంటున్న పనులకు తగ్గ వేతనాలు ఇవ్వట్లేదని నిరసన వ్యక్తంచేశారు. ఆశా వర్కర్ కు వేతనాలు పెంచేంతవరకు దశలవారీగా ఆందోళన చేస్తామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కె రమాదేవి ఎస్ అంజలి బుజ్జి మేరీ, పద్మ తదితరులు పాల్గొన్నారు.


# ఆంజనేయస్వామి ఆలయనిర్మాణం కోసం చిట్టేల రవీంద్ర విరాళం





**గుడ్లూరు, సిటిజన్ టైమ్స్, మే 05**

మండలంలోని చెమిడిదపాడు గ్రామ బస్టాండు వద్ద నిర్మాణంలో ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి వారి ఆలయనిర్మాణం కోసం గుడ్లూరు గ్రామానికి చెందిన చిట్టేల రవీంద్ర ధర్మపత్ని లక్ష్మీ, కుమారుడు హర్షవర్ధన్, కుమార్తె ప్రవల్లికలు రూ:5,016/- లు విరాళం అందించారు. మంగళవారం ట్రస్టు అధ్యక్షులు ఆలూరి వెంకట హనుమంతరావుకు ఫోన్ పే ద్వారా పంపడం జరిగిందన్నారు. వారికి ఆ సీతారామ లక్ష్మణ భరత శత్రుజ్ఞ పరివార దేవత సమేత శ్రీ సువర్చలా పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటూ ట్రస్ట్ తరపున హనుమంతరావు కృతజ్ఞతలు తెలిపారు.



# జంగిల్ ఎంట్రీ వెనుక జక్కన్న మాస్టర్ ప్లాన్!



ప్రపంచ సినిమా వేదికపై -ఆర్ఆర్ఆర్- సృష్టించిన ప్రభంజనం అంతా ఇంతా కాదు. సినిమాలో ప్రతి సన్నివేశం ఓ అద్భుతమైతే కొమురం భీమ్ పాత్రలో యంగ్ టైగర్ ఎన్టీఆర్ అడవిలో పులితో తలపడే జంగిల్ ఎంట్రీ సీన్ సినిమాకే హైలైట్ గా నిలిచింది. ఈ ఐకానిక్ సన్నివేశాన్ని చిత్రీకరించడానికి దర్శకుడు రాజమౌళి ఎంతటి శ్రమ కోర్చారో? ఎలాంటి సాంకేతికతను వాడారో? తాజాగా బయటకు వచ్చింది. అడవిలో భీమ్ పరిగెడుతున్నప్పుడు కెమెరా కూడా అదే వేగంతో అడ్డంకులను దాటుకుంటూ భీమ్ పక్కనే ప్రయాణించాలి. సాధారణ కెమెరా మూమెంట్స్‌తో ఇది సాధ్యం కాదని గ్రహించిన రాజమౌళి వినూత్న ఆలోచన చేశారు.

ఈ సీక్వెన్స్‌లో కెమెరాను మోయడానికి ఒక ప్రొఫెష నల్ పార్కర్ ఆర్టిస్ట్ ను రంగంలోకి దించారు. పార్కర్ ఆర్టిస్టులు అత్యంత వేగంగా అడ్డంకులను దూకుతూ ప్రయాణించడంలో దిట్టలు. వారి సహాయంతోనే ఆ విజువల్స్ అద్భుతంగా వచ్చాయన్నారు జక్కన్న. -ఎన్టీఆర్ అడవిలోని పొదలు, చెట్ల మధ్య నుంచి వేగంగా పరిగెడుతుంటే? పార్కర్ ఆర్టిస్ట్ కెమెరాను ధరించి ఆయనకు సమాంతరంగా పరిగెత్తారు. సాధారణంగా ట్రాక్ మీద కెమెరా వెళ్తే వచ్చే ఆ స్మూత్ ఫీలింగ్ కంటే ఒక మనిషి పరిగెడుతూ తీయడం వల్ల వచ్చే ఆ జంకీ మూమెంట్ సీన్‌కు సహజత్వాన్ని ఇచ్చిందని రాజమౌళి తెలిపారు.ప్రేక్షకులు కూడా తాము భీమ్ పక్కనే పరిగెడుతున్నామనే అనుభూతికి లోనవడానికి ఇదే ప్రధాన కారణం. ఈ సందర్భంగా ఎన్టీఆర్ అంకితభావం గురించి రాజమౌళి ప్రశంసలు కురిపించారు. ఆ సన్నివేశం కోసం ఎన్టీఆర్ చెప్పులు లేకుండా అడవిలో గంటల తరబడి పరిగెత్తాల్సి వచ్చింది. నేల మీద ఉన్న రాళ్లు, ముళ్లు గుచ్చుకున్నా లెక్కచేయకుండా భీమ్ పాత్రలోని ఆవేశాన్ని అద్భుతంగా పండించారు. నటుడి కష్టం, దర్శకుడి విజన్ , సాంకేతిక నిపుణుల సమన్వయం తోడవ్వడం వల్లే ఆ సీన్ వెండితెరపై విజువల్ వండర్‌గా హైలైట్ అయింది.రాజమౌళి సినిమాల్లో టెక్నాలజీని వాడటమే కాదు. విజువల్స్‌లో సహజత్వం కోసం ఫిజికల్ ఎఫర్ట్స్‌కు కూడా ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. పార్కర్ ఆర్టిస్టును వాడటం అనేది టాలీవుడ్ లో ఓ కొత్త ప్రయోగమని చెప్పాలి. ఈ చిన్న టెక్నిక్ వల్ల ఆ సీన్ ఎమోషన్ , వేగం ఏమాత్రం తగ్గకుండా ప్రేక్షకులను సీటు అంచున కూర్చోబెట్టింది. అందుకే హాలీవుడ్ దర్శకులు సైతం రాజమౌళి మేకింగ్ స్టైల్ ను చూసి ఆశ్చర్యపోతుంటారన్నది కాదనలేని నిజం. -ఆర్ఆర్ఆర్- విజయం వెనుక ఇలాంటి వేల మంది టెక్నీషియన్ల కృషి , రాజమౌళి మేధస్సు ఉన్నాయి.సాధారణ పరుగు పందెం లాంటి సీన్‌ను కూడా పార్కర్ ఆర్టిస్ట్ సహాయంతో అసాధారణంగా మార్చడం రాజమౌళికే చెల్లింది. జూనియర్ ఎన్టీఆర్ స్టామినా , రాజమౌళి సృజనాత్మకత కలిస్తే బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడమే కాదు. ఆస్కార్ వంటి అంతర్జాతీయ వేదికలపై కూడా భారతీయ జెండా రెపరెపలాడుతుందని సినిమా నిరూపించింది.



## నన్ను టీ20 ప్లేయర్‌గా చూడలేదు: కెరీర్‌లో ఆటుపోట్లపై కేఎల్ రాహుల్ ఎమోషనల్





కెరీర్ లో ఏదీ తను అనుకున్నట్లు జరగలేదని ఎమోషనల్ అయ్యాడు స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్. ముఖ్యంగా టీ20 ఇంటర్నేషనల్ కెరీర్ లో తనకు కాలం కలిసిరాలేదన్నాడు. తనను ఒక టెస్టు ప్లేయర్ గానే ముద్ర వేశారని ఎమోషనల్ అయ్యాడు. ఆ ముద్ర చెరిపేసుకోవడానికి ఎంతో కష్టపడాల్సి వచ్చిందని తెలిపాడు. ఐపీఎల్ 2026 లో ఢిల్లీ తరపున వీర విహారం చేస్తున్న రాహుల్.. ఈ సీజన్ లో టాప్ బ్యాటర్ గా ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. 9 మ్యాచ్ లలో 185 స్ట్రైక్ రేట్ తో 433 రన్స్ చేసి వారెవ్వా అనిపిస్తున్నాడు. పంజాబ్ కింగ్స్ పైన 64 బంతులలో 152 రన్స్ చేసి రాహుల్ క్లాస్ పర్ఫామెన్స్ అదో లెవెల్ అనిపించుకున్నాడు. ఐపీఎల్ లో ఇంత అద్భుత పర్ఫామెన్స్ ఇస్తున్న కేఎల్ కు.. 2022 నుంచి టీ20 జట్టులో చోటు దక్కడం లేదు. వన్డే, టెస్టులలో రెగ్యులర్ ప్లేయర్ గా కొనసాగుతున్నాడు. బెస్ట్ పర్ఫామెన్స్ ఇస్తున్నప్పటికీ తనను టెస్టు ప్లేయర్ గా చూస్తూ.. టీ20లో గుర్తించకపోవడంపై రాహుల్ తన మనసులోని అసంతృప్తిని.. త్వరలో టీ20 టీమ్ లో చోటు దక్కుతుందేమోననే ఆశాభావంతో ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. జియో స్టార్ నిర్వహించిన సూపరర్ స్టార్స్ ప్రోగ్రాంలో .. ఈ పదేళ్లలో తన ప్రోగ్రెస్ పై సంతృప్తిగా ఉన్నట్లు చెప్పాడు. పదేళ్ల క్రితం.. టీ20 లో చోటు దక్కించుకునేందుకు నా బెస్ట్ ఇచ్చేవాడిని. కానీ నన్ను టీ20 ప్లేయర్ గా పరిగణించలేదు. కనీసం వైట్ బాల్ ప్లేయర్ గా కూడా చూడలేదు. టెస్ట్ ప్లేయర్ గానే ముద్ర వేశారు. ఈ ముద్ర తొలగించుకోవడానికి.. వైట్ బాల్ గేమ్ లో మరింత మెరుగుపడినట్లు చెప్పాడు. ఇప్పుడు తన పర్ఫామెన్స్ పై సంతృప్తిగా ఉన్నట్లు తెలిపాడు. అదేసమయంలో కొన్ని


తప్పులు కూడా చేసినట్లు చెప్పాడు. అయితే ప్రతి సందర్భంలో బెస్ట్ ఇవ్వడానికి తన వంతుగా కష్టపడినట్లు చెప్పాడు. ఇప్పుడు నాకు ఇంకా కొంత టైమ్ ఉంది.. ఇదే ఊపులో ఆడతా.. చూడాలి ఎన్ని ట్రోఫీలు అందుకుంటానో .. అంటూ చెప్పుకొచ్చాడు.

## గుజరాత్ అసలైన ఆట ఇంకా ఆడలేదు: జేసన్ హోల్డర్



గుజరాత్ టైటాన్స్ జట్టు ఇంకా తన అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాల్సి ఉందని, అయినప్పటికీ విజయాలు సాధిస్తూ ఐపీఎల్ ప్లే-ఆఫ్ రేసులో నిలవడం సంతోషకరమని జేసన్ హోల్డర్ అభిప్రాయపడ్డారు. పంజాబ్ కింగ్స్‌పై నాలుగు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన హోల్డర్.. ప్రతి విజయం వ్యక్తిగత ప్రతిభపై కాకుండా జట్టు సమష్టి కృషితో దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. " మా ఆటతీరులో ఉన్న గొప్పతనం ఏంటంటే ప్రతిరోజూ ఒక్కరే రాణించడం లేదు. వేర్వేరు రోజుల్లో వేర్వేరు ఆటగాళ్లు జట్టును ముందుకు నడిపిస్తున్నారు" అని హోల్డర్ పేర్కొన్నారు. " మేము ఇంకా పూర్తిస్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన చేయలేదని భావిస్తున్నాను. కానీ మైదానంలోకి అడుగుపెట్టిన ప్రతిసారీ అవసరమైన రెండు పాయింట్లు సాధించడం విశేషం" అని ఆయన చెప్పారు.

## రూ.27 కోట్లకు పంత్ న్యాయం చేయట్లేదని విమర్శలు.. కోచ్ రియాక్షన్ ఇదే



ఐపీఎల్ 2026లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ పేలవ ప్రదర్శన చేస్తున్నాడు. 9 ఇన్నింగ్స్‌ల్లో 128.30 స్ట్రైక్‌రేట్‌తో 204 పరుగులు మాత్రమే చేశాడు. కెప్టెన్‌గానూ అతను రాణించలేకపోతున్నాడు. లఖ్‌నవూ ఇప్పటివరకు 9 మ్యాచ్‌ల్లో రెండే విజయాలు సాధించింది. వరుసగా ఆరు ఓటములు చవిచూసిన ఆ జట్టు ప్లే ఆఫ్స్‌కు దాదాపుగా దూరమైంది. దీంతో పంత్‌పై విమర్శల దాడి ఎక్కువైంది. రిషభ్ తాను పొందిన భారీ ధరకు ఏమాత్రం న్యాయం చేయలేకపోతున్నాడని విమర్శలు వస్తున్నాయి. గతేడాది వేలంలో రూ.27 కోట్ల రికార్డు ధరకు పంత్‌ను ఎల్ఎస్‌జీ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎల్ఎస్‌జీ కెప్టెన్‌కు కోచ్ జస్టిన్ లాంగర్ మద్దతుగా నిలిచాడు. కెప్టెన్సీ అనేది చాలా కఠినమైదని, ఎంతో ఒత్తిడిని తట్టుకోవాల్సి ఉంటుందని లాంగర్ పేర్కొన్నాడు."నిజాయతీగా చెప్పాలంటే దీనికి డబ్బుతో ఏమాత్రం సంబంధం లేదని నా అభిప్రాయం. నాయకత్వం అనేది ఒక కఠినమైన బాధ్యత. దానితో పాటు ఎంతో ఒత్తిడిని మోయాల్సి ఉంటుంది, ఆ విషయం పంత్‌కు బాగా తెలుసు. జట్టు కోసం అతను ఎంతో ఒత్తిడిని భరిస్తున్నాడు. మా అందరిలాగే 98 శాతం సమయం అతను చిరునవ్వుతోనే ఆ బాధ్యతను నిర్వర్తిస్తాడు. మిగిలిన 2 శాతం సమయం మాత్రం పరిస్థితి కాస్త కఠినంగా ఉంటుంది. అయినప్పటికీ పంత్ తన ప్రయత్నాన్ని కొనసాగిస్తూనే ఉన్నాడు. కఠోరంగా శ్రమిస్తున్నాడు. ఈ సీజన్ ఆరంభంలోనే జట్టుకు విజయాన్ని అందించే ఒక అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. అతను నవ్వుతూ తనదైన శైలిలో దూకుడుగా ఆడినప్పుడు మాకు ఎంతో సంతోషంగా అనిపిస్తుంది. ఆ స్థాయి ప్రదర్శనకు అతను ఎంతో దూరంలో లేడు. ఇటీవల ప్రాక్టీస్ మ్యాచ్‌లో 30 బంతుల్లోనే 95 పరుగులు చేశాడు. దీన్నిబట్టి పంత్ త్వరలోనే ఫామ్‌లోకి వస్తాడనే నమ్మకం ఉంది" అని జస్టిన్ లాంగర్ పేర్కొన్నాడు.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776